

# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | గురువారం 08-01-2026 | సంపుటి - 26 | సంచిక -232 | రూ : 4 | పేజీలు: 8


# పోలవరం పనులపై సీఎం చంద్రబాబు సమీక్ష

## నిర్వాసితులపై పూర్తి ఫోకస్ పెట్టాలని ఆదేశం




- మిగిలిన పనులు గడువులోగా పూర్తి చేయాలని ఆదేశం
- నిర్వాసితుల పునరావాసంపై పూర్తిస్థాయిలో దృష్టి పెట్టాలని సూచన
- ఆర్ అండ్ ఆర్ పనులపై యాక్షన్ ప్లాన్ రూపొందించాలన్న సీఎం
- మే మొదటి వారంలో మళ్లీ పనులను పరిశీలిస్తానని వెల్లడి

2లో



2లో

## వెనెజువెలా చమురు నౌకను స్వాధీనం చేసుకున్న అమెరికా బలగాలు

ట్యాంకర్‌ను కొన్ని రోజులుగా వెంబడించిన అమెరికా

# కర్ణాటకలో దారుణం..

## బీజేపీ మహిళా కార్యకర్తను వివస్త్రను చేసిన పోలీసులు?

- కర్ణాటకలోని హుబ్లీలో బీజేపీ మహిళా కార్యకర్తపై పోలీసుల దాడి
- వివస్త్రను చేసి అమానుషంగా ప్రవర్తించారంటూ తీవ్ర ఆరోపణలు
- ఓటర్ల జాబితా సవరణ విషయంలో చెలరేగిన వివాదమే కారణం
- ఘటనకు సంబంధించిన వీడియో వైరల్.. భగ్గుమన్న బీజేపీ నేతలు
- ఆమెనే దుస్తులు విప్పుకుందంటున్న పోలీసులు.. బాధితురాలి ఖండన

2లో





## ఫోన్ ట్యాపింగ్ కేసులో

### రేవంత్ రెడ్డి సోదరుడికి సిట్ నోటీసులు

- తెలంగాణ ఫోన్ ట్యాపింగ్ కేసులో కొత్త పరిణామాలు
- రేపు విచారణకు రావాలంటూ కొండల్ రెడ్డికి సిట్ నోటీసులు
- బీఆర్ఎస్ హయాంలో కొండల్ రెడ్డి ఫోన్ ట్యాప్ చేసినట్టు దర్యాప్తులో తేలిన వైనం

హైదరాబాద్, జనవరి 7: తెలంగాణ ఫోన్ ట్యాపింగ్ కేసులో కొత్త పరిణామాలు చోటు చేసుకున్నాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సొంత సోదరుడు కొండల్ రెడ్డికి స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీమ్ (SIT) నోటీసులు పంపింది. రేపు ఉదయం 11 గంటలకు తరువాయి 2లో




2లో

## బంగ్లాదేశ్‌లో ఆగని హింస..

ప్రాణాలు కాపాడుకోబోయి కాలువలోకి దూకి హిందూ యువకుడి మృతి

## అమరావతికి చట్టబద్ధత కల్పించండి..

# అమిత్ షాకు సీఎం విజ్ఞప్తి

- కేంద్ర హోం మంత్రి అమిత్ షాతో ముఖ్యమంత్రి చంద్రబాబు భేటీ
- అమరావతికి చట్టబద్ధత కల్పిస్తూ పార్లమెంటులో బిల్లు పెట్టాలని విజ్ఞప్తి
- జీ-రామ్-జీ పథకం నిధుల వాటాపై వెసులుబాటు కల్పించాలని విన్నపం
- 60:40 నిష్పత్తితో రాష్ట్రంపై ఆర్థిక భారం పడుతోందని వివరణ
- రాష్ట్రానికి కేంద్ర సహకారం కొనసాగించాలని కోరిన ముఖ్యమంత్రి

2లో






2లో

# ఐఐటీల్లో అమ్మ భాష

- బీటెక్ తొలి సెమిస్టర్.. కోరుకున్న మాధ్యమంలో చదువుకునే వెసులుబాటు
- ఎంటెక్ సిలబస్ ప్రక్షాళన.. ఇంటర్న్‌షిప్ తప్పనిసరి
- క్రీడలు, ఒలింపియాడ్ కోటా సీట్లూ జోసా ద్వారా భర్తీ
- 56వ ఐఐటీ కౌన్సిల్ నిర్ణయాలివీ..

# తెలంగాణతో నీటి వివాదాలపై చంద్రబాబు కీలక వ్యాఖ్యలు

అమరావతి: ఏపీ సీఎం చంద్రబాబు ఈరోజు పోలవరం ప్రాజెక్టు పనులను పరిశీలించారు. అనంతరం అక్కడే మీడియాతో మాట్లాడుతూ తెలంగాణతో నీటి వివాదాలపై సున్నితంగా, స్పష్టంగా స్పందించారు. గోదావరి నదిలో నీళ్లు పుష్కలంగా ఉన్నాయని, సముద్రంలోకి పోతున్న నీటిని ఎవరైనా వాడుకోవచ్చని చంద్రబాబు అన్నారు. పోలవరం ప్రాజెక్టుకు అభ్యంతరం చెప్పడం సరికాదని, నీటి విషయంలో రాజకీయాలు చేయొద్దని తెలంగాణను కోరారు. "తెలుగు జాతి ఒక్కటే... ఇచ్చిపుచ్చుకునే ధోరణి ఉండాలి. రెండు రాష్ట్రాల మధ్య విరోధాలు పెంచుకుని ఇతరులు ఆనందించే పరిస్థితి రావొద్దు" అని హితవు పలికారు. కొందరు మాట్లాడుతున్న మాటలు వింటుంటే... ఆ రాజకీయాలేమిటో తనకే అర్థం కావడం లేదని చంద్రబాబు అన్నారు. గోదావరి నది పైభాగంలో దేవాదుల ఉందని...దేవాదుల నుంచి నీళ్లు వస్తే కింద ఉన్న పోలవరానికే వస్తాయని, కిందికి వచ్చే నీళ్లకు అభ్యంతరం చెబితే అర్థమేమీ ఉండదని అన్నారు. తాము ఎప్పుడూ దేవాదులకు వ్యతిరేకం కాదని, తెలంగాణ కాళేశ్వరం ప్రాజెక్టు కడుతున్నప్పుడు కూడా అభ్యంతరం చెప్పలేదని గుర్తు చేశారు. నీళ్లు పొదుపు చేస్తే తెలంగాణకూ లాభమేనని, మిగులు నీటిని శ్రీశైలం, నాగార్జునసాగర్‌లో నిల్వ చేసుకోవచ్చని సూచించారు. కృష్ణా నదిలో నీళ్లు తక్కువగా ఉండటంతో పైన ప్రాజెక్టులు కడితే నష్టమని, కానీ గోదావరి డెల్టాను కాపాడుకుని కృష్ణాగోదావరి అనుసంధానం చేస్తే ఇబ్బంది ఉండదని అన్నారు. రాయలసీమ ఎత్తిపోతలపై కొందరు చేస్తున్న వ్యాఖ్యల్లో అర్థం లేదని, అబద్ధాలను వందసార్లు చెబితే నిజమవుతుందని అనుకుంటున్నారని ఎద్దేవా చేశారు. పోలవరం ఆలస్యంపై గత వైసీపీ ప్రభుత్వాన్ని చంద్రబాబు విమర్శించారు. గత ప్రభుత్వం వల్లే 67 ఏళ్లు ఆలస్యమైందని, డయాఫ్రం వాల్ పాడైందని ఐఐటీ హైదరాబాద్ నిపుణులు చెప్పిన తర్వాతే వాళ్లకు తెలిసిందని విమర్శించారు. ఇప్పుడు కొత్తగా డయాఫ్రం వాల్ కడుతున్నామని, ఫిబ్రవరి 15లోపు పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. వైసీపీ అక్రమాలపై దర్యాప్తు జరుగుతోందని, కానీ దర్యాప్తు పేరుతో కాలయాపన చేసుకుంటూ పోతే, పనులు పూర్తి చేయడానికి చాలా కాలం పడుతుందని చెప్పారు. అనుమతులు లేని ప్రాజెక్టులకు రూ. 2 వేల కోట్లు ఖర్చు పెట్టారని... ఎన్జీటీకి రూ. 100 కోట్ల జరిమానా కట్టారని దుయ్యబట్టారు.

## ఫోన్ ట్యాపింగ్ కేసులో రేవంత్ రెడ్డి సోదరుడికి సిట్ నోటీసులు

హైదరాబాద్: తెలంగాణ ఫోన్ ట్యాపింగ్ కేసులో కొత్త పరిణామాలు చోటు చేసుకున్నాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సొంత సోదరుడు కొండల్ రెడ్డికి స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీమ్ (SIT) నోటీసులు పంపింది. రేపు ఉదయం 11 గంటలకు విచారణకు రావాలని ఆ నోటీసులో అధికారులు పేర్కొన్నారు. రేవంత్ రెడ్డి విపక్ష నాయకుడిగా ఉన్న రోజుల్లో కొండల్ రెడ్డి ఫోన్‌ను ట్యాప్ చేశారని దర్యాప్తులో తేలింది. ఈ నేపథ్యంలో ఆయన వాంగ్మూలం తీసుకోవడం కోసం విచారణకు పిలుస్తున్నారు. ఇదే కేసులో మరో ఇద్దరు బీఆర్ఎస్ నేతలకూ నోటీసులు వెళ్లాయి. మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్, చిరుమర్తి లింగయ్యలను కూడా రేపు ఉదయం 11 గంటలకు హాజరు కావాలని పోలీసులు ఆదేశించారు. ఇప్పటికే బీఆర్ఎస్ ఎమ్మెల్సీ నవీన్ రావు తండ్రి కొండలరావు, ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు కుమారుడు సందీప్ రావులకు కూడా ఇలాంటి నోటీసులు జారీ అయ్యాయి.

## పోలవరం పనులపై సీఎం చంద్రబాబు సమీక్ష...

అమరావతి: సీఎం చంద్రబాబు పోలవరం ప్రాజెక్టు పనుల పురోగతిపై దృష్టి సారించారు. బుధవారం ఆయన ప్రాజెక్టు సైట్ వద్ద జలవనరుల శాఖ ఉన్నతాధికారులు, ఇంజనీర్లతో ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ప్రాజెక్టులో మిగిలిన పనులను గడువులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రాజెక్టులో ఇప్పటికే 87 శాతం సివిల్ పనులు పూర్తయ్యాయని, మిగిలిన పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సీఎం స్పష్టం చేశారు. ముఖ్యంగా ప్రాజెక్టు నిర్వాసితుల పునరావాసం, ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ పనులపై పూర్తిస్థాయిలో దృష్టి సారించాలని ఆదేశించారు. దీనికోసం ప్రత్యేకంగా ఒక యాక్షన్ ప్లాన్ రూపొందించుకుని ముందుకు సాగాలని సూచించారు. అదేవిధంగా పోలవరం ఎడమ కాలువ పనులను వేగవంతం చేయాలని సీఎం తెలిపారు. కుడి కాలువ ద్వారా కొల్లేరు ప్రాంతానికి కూడా నీరందించేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని కీలక సూచన చేశారు. ఈ సమీక్షా సమావేశంలో మంత్రులు నిమ్మల రామానాయుడు, కొలుసు పార్థసారధి, నాదెండ్ల మనోహర్, ఇతర ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. వచ్చే మే నెల మొదటి వారంలో తాను మళ్లీ పోలవరం ప్రాజెక్టు పనుల పురోగతిని స్వయంగా తనిఖీ చేస్తానని చంద్రబాబు వెల్లడించారు.

## సాక్షిపై పరువునష్టం దావా..
## విశాఖ కోర్టుకు హాజరైన మంత్రి లోకేశ్

విశాఖపట్నం: రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ విశాఖపట్నం కోర్టుకు హాజరయ్యారు. సాక్షి దినపత్రిక తనపై ప్రచురించిన ఓ అసత్య కథనంపై ఆయన గతంలో పరువునష్టం దావా వేశారు. ఈ కేసుకు సంబంధించి విశాఖ 12వ అదనపు జిల్లా న్యాయస్థానంలో జరుగుతున్న క్రాస్ ఎగ్జామినేషన్ కోసం ఆయన ఈరోజు తన న్యాయవాదులతో కలిసి హాజరయ్యారు. 2019 అక్టోబర్ 22న సాక్షి పత్రికలో 'చినబాబు చిరుతిండి.. 25 లక్షలండి' అనే శీర్షికతో కథనం ప్రచురితమైంది. ఇది పూర్తిగా అవాస్తవమని ఆరోపిస్తూ లోకేశ్ ఈ కేసు దాఖలు చేశారు. ఇప్పటికే ఈ కేసులో రెండుసార్లు క్రాస్ ఎగ్జామినేషన్ పూర్తి కాగా, నేడు మూడోసారి ఆయన కోర్టు విచారణకు హాజరయ్యారు.

## బంగ్లాదేశ్‌లో ఆగని హింస..
## ప్రాణాలు కాపాడుకోబోయి కాలువలోకి దూకి హిందూ యువకుడి మృతి

బంగ్లాదేశ్‌లో మైనారిటీలే లక్ష్యంగా హింసాత్మక దాడులు కొనసాగుతూనే ఉన్నాయి. తాజాగా దొంగతనం ఆరోపణలతో ఓ అల్లరి మూక వెంటపడటంతో ప్రాణాలు కాపాడుకునేందుకు కాలువలోకి దూకిన ఓ హిందూ యువకుడు మృతి చెందాడు. నౌగావ్ జిల్లాలోని మహాదేవ్‌పూర్ ఉపజిల్లాలో మంగళవారం మధ్యాహ్నం ఈ దారుణ ఘటన చోటుచేసుకుంది. స్థానిక మీడియా కథనాల ప్రకారం చాక్‌గోరి ప్రాంతానికి చెందిన మిథున్ సర్కార్ (25) అనే యువకుడిపై కొందరు దొంగతనం నెపం మోపి వెంబడించారు. వారి నుంచి తప్పించుకునే ప్రయత్నంలో మిథున్ సమీపంలోని లోతైన కాలువలోకి దూకాడు. అయితే, నీటి ప్రవాహం బలంగా ఉండటంతో అందులో కొట్టుకుపోయాడు. సమాచారం అందుకున్న పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని గాలింపు చర్యలు చేపట్టారు. కొన్ని గంటల తర్వాత మిథున్ మృతదేహాన్ని వెలికితీశారు. ఈ ఘటనపై మహాదేవ్‌పూర్ పోలీస్ స్టేషన్ ఆఫీసర్ షాహిదుల్ ఇస్లాం స్పందించారు. "దొంగతనం అనుమానంతో కొందరు వెంబడించడంతో ఆ యువకుడు కాలువలోకి దూకినట్లు ప్రాథమికంగా తెలిసింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించాం. ఈ ఘటనపై లోతుగా దర్యాప్తు చేసి, చట్టపరమైన చర్యలు తీసుకుంటాం" అని ఆయన వివరించారు. గత 19 రోజుల్లో బంగ్లాదేశ్‌లో హిందువులపై జరిగిన దాడుల్లో ఇది ఏడో ఘటన కావడం గమనార్హం. ఈ వారంలోనే ఇది మూడోది. సోమవారం నర్సింగ్ది జిల్లాలో శరత్ చక్రవర్తి అనే వ్యక్తిని, జషోర్ జిల్లాలో రాణా ప్రతాప్ బైరాగి అనే వ్యాపారిని దుండగులు దారుణంగా హత్య చేశారు. అంతకుముందు డిసెంబర్‌లో దైవదూషణ ఆరోపణలతో దీపు చంద్ర దాస్ అనే యువకుడిని ఓ మూక కొట్టి చంపి, చెట్టుకు వేలాడదీసి నిప్పంటించిన ఘటన ప్రపంచవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. బంగ్లాదేశ్‌లో మహ్మద్ యూనస్ నేతృత్వంలోని మధ్యంతర ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మైనారిటీలపై, ముఖ్యంగా హిందువులపై దాడులు పెరగడం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది.

## వెనెజువెలా చమురు నౌకను స్వాధీనం చేసుకున్న అమెరికా బలగాలు

ఆంక్షల కారణంగా ఉత్తర అట్లాంటిక్‌లో నిలిచిపోయిన వెనెజువెలాకు చెందిన భారీ చమురు నౌకను అమెరికా బలగాలు స్వాధీనం చేసుకున్నాయి. ఈ ట్యాంకర్‌ను కొన్ని రోజులుగా అమెరికా సైన్యం వెంబడించి, చివరకు దాని పైకి చేరుకున్నట్లు ప్రకటించింది. లెబనాన్‌లోని హెజ్‌బొల్లా సంస్థకు సంబంధించిన ఓ కంపెనీ కోసం స్మగ్లింగ్ జరుగుతోందన్న ఆరోపణలపై ఈ నౌకను అమెరికా 2024లో నిషేధించింది. గత నెలలో వెనెజువెలా వైపు వెళ్తున్న ఈ నౌకను స్వాధీనం చేసుకోవడానికి అమెరికా కోస్ట్ గార్డ్ ప్రయత్నించింది. తప్పించుకున్న ఈ నౌక అట్లాంటిక్‌లో తిరుగుతోంది. ఈ నౌకపై కొన్ని వారాలుగా నిఘా పెట్టిన అమెరికా ఎట్టకేలకు దాని పైకి చేరుకుంది.

## విజయవాడబెంగళూరు ఎక్స్‌ప్రెస్‌వే..
## ఏపీలో ఎన్‌హెచ్‌ఏఐ రెండు గిన్నిస్ రికార్డులు

బెంగళూరుకడపవిజయవాడ ఎక్స్‌ప్రెస్‌వే నిర్మాణంలో భాగంగా ఏపీలో భారత జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (NHAI) రెండు గిన్నిస్ వరల్డ్ రికార్డులను సృష్టించింది. ఇది భారత్‌కు, ఆంధ్రప్రదేశ్‌కు గర్వకారణమని సీఎం చంద్రబాబు తెలిపారు. "బెంగళూరుకడప విజయవాడ ఎకనామిక్ కారిడార్ (NH544G) లో M/s రాజ్‌పథ్ ఇన్‌ఫ్రాకాన్ ప్రైవేట్ లిమిటెడ్ ద్వారా NHAI 24 గంటల్లోనే 28.95 లేన్ కిలోమీటర్ల పొడవున, 10,675 మెట్రిక్ టన్నుల తారు కాంక్రీట్‌ను నిరంతరాయంగా వేసి రెండు గిన్నిస్ రికార్డులను నెలకొల్పింది" అని సీఎం చంద్రబాబు 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. కేంద్ర ప్రభుత్వ దార్శనికత, కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ నాయకత్వంలో ప్రపంచస్థాయి రహదారుల నిర్మాణం, ఇంజినీర్లు, కార్మికుల అసాధారణ నిబద్ధత వల్లే ఈ ఘనత సాధ్యమైందని ఆయన కొనియాడారు. ఇదే కారిడార్‌లోని ఇతర ప్యాకేజీలలో 2026 జనవరి 11 నాటికి మరో రెండు గిన్నిస్ రికార్డుల కోసం ప్రయత్నాలు జరుగుతున్నాయని, వారికి శుభాకాంక్షలు తెలుపుతున్నానని చంద్రబాబు పేర్కొన్నారు. భారత్‌మాల ఫేజ్ II కింద చేపట్టిన ఈ ఆరు లేన్ల గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్‌వే నిర్మాణం ఇటీవల వేగం పుంజుకుంది. ఈ ప్రాజెక్టు పూర్తయితే, ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి నుంచి బెంగళూరుకు ప్రయాణ సమయం ప్రస్తుతం ఉన్న 11-12 గంటల నుంచి సుమారు 6 గంటలకు తగ్గనుంది. ఈ రహదారి ఏపీలోని గుంటూరు, ప్రకాశం, కర్నూలు, కడప జిల్లాల మీదుగా కర్ణాటకలోకి ప్రవేశిస్తుంది.మొత్తం 518 నుంచి 624 కిలోమీటర్ల పొడవున్న ఈ రహదారిని సుమారు రూ.19,200 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్నారు. ఇందులో కోడికొండ నుంచి అద్దంకి/ముప్పవరం వరకు 342 కిలోమీటర్ల భాగం పూర్తిగా గ్రీన్‌ఫీల్డ్ కాగా, మిగిలిన భాగాన్ని బ్రౌన్‌ఫీల్డ్ పద్ధతిలో అభివృద్ధి చేస్తున్నారు. ఈ ప్రాజెక్టు ఏపీ కనెక్టివిటీకి, సరుకు రవాణాకు కీలకం కానుంది.

## ఐఐటీల్లో అమ్మ భాష

హైదరాబాద్: విద్యార్థులకు ఆంగ్ల భాష సమస్యగా మారకుండా... ఇంజినీరింగ్ విద్యనూ మాతృభాషల్లో అందించాలని భావిస్తున్న కేంద్ర ప్రభుత్వం ఐఐటీల్లో బీటెక్ ప్రథమ సెమిస్టర్‌ను వారు కోరుకున్న భాషల్లో చదువుకునే అవకాశం ఇవ్వాలని నిర్ణయించింది. వివిధ రాష్ట్రాలు, వివిధ భాషల్లో ఇంటర్, తత్సమాన చదువు పూర్తిచేసి ఐఐటీల్లో సీట్లు సాధించిన వారు తొలి ఆరు నెలలు ఆంగ్లానికి అలవాటు పడే వరకూ మాతృభాషలో చదువుకునేందుకు వీలుకల్పిస్తారు. ఆయా భాషల్లో పాఠ్యాంశాల వీడియోలను ఉంచుతారు. పుస్తకాలను కూడా ప్రాంతీయ భాషల్లో అందుబాటులో ఉంచుతారు. ఎవరైనా మాట్లాడుతుంటే అప్పటికప్పుడు ఆంగ్ల ఉపన్యాసాలను ప్రాంతీయ భాషల్లోకి తర్జుమా చేసేలా కృత్రిమమేధ(ఏఐ)ను సమర్థంగా ఉపయోగించుకోవాలని, అందుకు ఐఐటీలు ఇతర సాంకేతిక విద్యాసంస్థలకు ఆదర్శంగా నిలవాలని కేంద్ర విద్యాశాఖ సూచించింది. గత ఆగస్టు 25వ తేదీన దిల్లీలో 56వ ఐఐటీ కౌన్సిల్ సమావేశం నిర్వహించిన సంగతి తెలిసిందే. కేంద్ర విద్యాశాఖ మంత్రి ఛైర్మన్‌గా ఉన్న కౌన్సిల్ సమావేశంలో 23 ఐఐటీల డైరెక్టర్లు, వాటి ఛైర్మన్లు, యూజీసీ, ఏఐసీటీఈ తదితర అధికారులు పాల్గొంటారు. ఐఐటీలకు సంబంధించి ఏ కీలక నిర్ణయమైనా ఇందులోనే తీసుకుంటారు. నాటి సమావేశ తీర్మానాలను ప్రభుత్వం తాజాగా విడుదల చేసింది. ప్రథమ సెమిస్టర్ తర్వాత విద్యార్థులు ఆంగ్ల మాధ్యమంలో చదవాల్సి ఉంటుంది. గత రెండేళ్ల నుంచి ఐఐటీ జోధ్‌పుర్‌లో బీటెక్ ఫస్టియర్‌ను హిందీలో చదువుకునే వెసులుబాటు కల్పించారు.

**పరిశ్రమల అవసరాల మేరకు ఎంటెక్...**

ఎంటెక్ సిలబస్‌ను పూర్తిగా ప్రక్షాళన చేయాలని నిర్ణయించారు. భారత్‌లో బీటెక్ పూర్తయిన తర్వాత ఎందుకు ఎంటెక్‌లో చేరటం లేదన్న దానిపై చర్చించిన ఐఐటీలు.. అందుకు పరిమితంగా స్పెషలైజేషన్లు ఉండటం, ఇంటర్న్‌షిప్ అవకాశాలు లేకపోవడం కారణంగా భావించారు. అందుకే ఎంటెక్‌లో ఇండస్ట్రీ ఇంటర్న్‌షిప్‌ను తప్పనిసరి చేయాలని నిర్ణయించారు. పరిశ్రమల నిపుణులతో కూడిన కమిటీలను నియమించి.. ఇండస్ట్రీ అవసరాల మేరకు కోర్సులను రూపొందించాలని నిర్ణయించారు.

## కర్ణాటకలో దారుణం..
## బీజేపీ మహిళా కార్యకర్తను వివస్త్రను చేసిన పోలీసులు?

కర్ణాటకలోని హుబ్లీ నగరంలో దారుణమైన సంఘటన చోటుచేసుకుంది. ఓ బీజేపీ మహిళా కార్యకర్తపై పోలీసులు దాడి చేసి, వివస్త్రను చేశారన్న ఆరోపణలు తీవ్ర కలకలం రేపుతున్నాయి. ఓటర్ల జాబితా సవరణ విషయంలో తలెత్తిన వివాదమే ఈ ఘటనకు దారితీసినట్టు తెలుస్తోంది. ఇందుకు సంబంధించిన వీడియో ఒకటి బుధవారం బయటకు రావడంతో ఈ అమానుషం వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళితే... హుబ్లీ కేశ్వాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో బీజేపీ కార్యకర్త సుజాత హండి నివాసం ఉంటున్నారు. ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమంలో భాగంగా ఆమె ఓటర్ల మ్యాపింగ్ చేపట్టారు. దీనిపై ఆగ్రహం వ్యక్తం చేసిన కాంగ్రెస్ కార్పొరేటర్ సువర్ణ కల్లకుంట్ల, సుజాతపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు ఆధారంగా పోలీసులు సుజాతను అరెస్ట్ చేసేందుకు వెళ్లినప్పుడు ఈ ఘటన జరిగింది. మగ పోలీసులు తనపై దాడి చేసి, అసభ్య పదజాలంతో దూషిస్తూ, వివస్త్రను చేశారని బాధితురాలు ఆరోపిస్తున్నారు. బయటకు వచ్చిన వీడియోలో కూడా ఓ పురుష పోలీస్ అధికారి, దుస్తులు లేని స్థితిలో ఉన్నట్టుగా కనిపిస్తున్న సుజాత భుజాన్ని పట్టుకోవడం కనిపిస్తోంది. ఈ ఘటనపై బీజేపీ ఎమ్మెల్యే మహేశ్ తెంగినకాయి తీవ్రంగా స్పందించారు. ఇది మహిళా లోకానికే జరిగిన అవమానమని, ఈ అమానుష చర్యకు పాల్పడిన పోలీసులను వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. అయితే, ఈ ఆరోపణలను పోలీసులు తోసిపుచ్చుతున్నారు. సుజాత హండి తనంతట తానే దుస్తులు విప్పుకుందని వారు చెబుతున్నారు. ఈ ఘటనపై రాష్ట్ర హోం మంత్రి చర్యలు తీసుకోవాలని, కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు విజయేంద్ర దృష్టికి ఈ విషయాన్ని తీసుకువెళతామని బీజేపీ నేతలు తెలిపారు. ఈ సంఘటనపై పోలీసుల నుంచి ఇంకా అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.

# అమరావతికి చట్టబద్ధత కల్పించండి.. అమిత్ షాకు సీఎం చంద్రబాబు విజ్ఞప్తి

న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు బుధవారం న్యూఢిల్లీలో కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షాతో సమావేశమయ్యారు. రాష్ట్రానికి సంబంధించిన పలు కీలక అంశాలపై చర్చించిన ఆయన, అమరావతికి రాజధానిగా చట్టబద్ధత కల్పించాలని ప్రధానంగా విజ్ఞప్తి చేశారు. పోలవరం ప్రాజెక్టు పర్యటనను ముగించుకుని నేరుగా ఢిల్లీకి వెళ్లిన చంద్రబాబు, అమిత్ షాతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా, అమరావతిని ఏపీ రాజధానిగా ఖరారు చేస్తూ పార్లమెంటులో ఒక బిల్లును ప్రవేశపెట్టి చట్టబలం కల్పించాలని కోరారు. ఇలా చేయడం వల్ల రాష్ట్ర ప్రజల ఆకాంక్షలు నెరవేరడమే కాకుండా, రాష్ట్ర అభివృద్ధి కూడా వేగవంతం అవుతుందని ఆయన వివరించారు. అలాగే, జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం స్థానంలో కేంద్రం తీసుకొచ్చిన 'జీరామ్‌జీ' పథకంలోని నిబంధనలపైనా చంద్రబాబు చర్చించారు. ఈ పథకంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధుల వాటాను 60:40 నిష్పత్తికి మార్చడం వల్ల, ఇప్పటికే ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్న ఆంధ్రప్రదేశ్‌పై తీవ్ర ప్రతికూల ప్రభావం పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని ప్రత్యేకంగా పరిగణనలోకి తీసుకుని, ఈ విషయంలో ప్రత్యామ్నాయ ఆర్థిక వెసులుబాటు కల్పించాలని



కోరారు. ఆర్థికంగా క్లిష్ట పరిస్థితుల్లో ఉన్న రాష్ట్రాన్ని తిరిగి గాడిన పెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే అందిస్తున్న సహకారానికి చంద్రబాబు ధన్యవాదాలు తెలిపారు. భవిష్యత్తులోనూ ఇదే తరహా మద్దతును కొనసాగించాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలోని తాజా పరిణామాలు, అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలు తీరుపై కూడా ఇరువురు నేతలు సమీక్షించుకున్నారు.

# రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్టమైన కార్యాచరణ చేపట్టాలి

**: జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్**



ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: జిల్లాలో రోడ్డు ప్రమాదాల నియంత్రణకు పటిష్టమైన కార్యాచరణ అమలు చేయాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. ఐడిఓసి లోని కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుండి జూమ్ మీటింగ్ ద్వారా జిల్లా స్థాయి రోడ్డు భద్రత కమిటీ సమావేశం నిర్వహించి ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రహదారుల భద్రతపై ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు లఘు చిత్రాలను రూపొందించి సినిమా థియేటర్లలో ప్రదర్శించాలన్నారు. అలాగే ప్రతి సంవత్సరం జనవరి నెలలో నిర్వహించే జాతీయ రోడ్డు భద్రత మాస ఉత్సవాల సందర్భంగా రోడ్డు భద్రతకు సంబంధించి తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పాటించాల్సిన నియమాలపై జిల్లా వ్యాప్తంగా విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల సందర్భంగా పాఠశాలలు, కళాశాలలు, గ్రామాలు, పట్టణాల్లో రోడ్డు భద్రత అవగాహన ర్యాలీలు, శిక్షణా కార్యక్రమాలు, వాహనదారులకు అవగాహన శిబిరాలు నిర్వహించాలని తెలిపారు. హెల్మెట్, సీట్‌బెల్ట్ వినియోగం, వేగ నియంత్రణ, మద్యం సేవించి వాహనాలు నడపకూడదనే అంశాలపై ప్రత్యేక ప్రచారం చేపట్టాలని సూచించారు. జిల్లా వ్యాప్తంగా రహదారులపై ఉన్న గుంతలను వెంటనే గుర్తించి పూడ్చేందుకు తగిన చర్యలు చేపట్టాలని తెలిపారు.రహదారులపై గుంతలను పూడ్చే బాధ్యత సంబంధిత ప్రతి శాఖకూ ఉందని అన్నారు. తరచుగా ప్రమాదాలు జరుగుతున్న బ్లాక్ స్పాట్లను గుర్తించి వాటి నివారణకు అవసరమైన భద్రతా చర్యలు చేపట్టాలని, ఇందుకు అనుగుణంగా బ్లాక్ స్పాట్ల మ్యాప్‌ను సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. కొత్తగూడెం పట్టణంలో రైల్వే స్టేషన్ పరిసరాలు లక్ష్మీదేవిపల్లి మోర్ సూపర్ మార్కెట్ వద్ద ట్రాఫిక్ సిగ్నల్ లైట్స్ ఏర్పాటు చేయాలని తెలిపారు. అలాగే కొత్తగూడెం పట్టణంలోని ఫుట్‌పాత్‌ల వెంట ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తున్న చిరు వ్యాపారులను అనువైన ఇతర ప్రాంతాలకు తరలించేందుకు తగిన స్థలాన్ని గుర్తించాలని అన్నారు. భద్రాచలం అంబేద్కర్ సెంటర్‌లోని ట్రాఫిక్ సిగ్నల్ లైట్లను మరమ్మత్తులు చేసి సక్రమంగా పనిచేసేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. రోడ్డు ప్రమాదాలను తగ్గించేందుకు పోలీస్, ఆర్ అండ్ బీ, వైద్య శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు. మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై కఠిన చర్యలు తీసుకుని చట్ట ప్రకారం జైలు శిక్షలు విధించేలా చర్యలు చేపట్టాలని తెలిపారు. తరచూ ప్రమాదాలు జరిగే ప్రాంతాల్లో అవసరమైన భద్రతా చర్యలు అమలు చేయాలని, ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించేలా పోలీస్ శాఖ ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలని ఆదేశించారు.

## మహిళలకు అనువైన చీరలు అందించిన ఘనత కాంగ్రెస్ సొంతం

**- ధర్మోజి గూడెం సర్పంచ్ జువ్వి నర్సింహ్మా**



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: మహిళల హుందాతనాన్ని పెంచే విధంగా ఖరీదైన చీరలు పంపిణీ చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వం సొంతమని ధర్మోజి గూడెం సర్పంచ్ జువ్వి నర్సింహ్మా అన్నారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా మహిళలకు అందించిన చీరలను చౌటుప్పల్ మండలం ధర్మోజి గూడెం గ్రామంలో బుధవారం ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జువ్వి నర్సింహ్మా మాట్లాడుతూ ఎన్నికల హామీలను అమలు చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీకే సొంతమన్నారు. ఇల్లు లేని నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లు అందించి వారి చిరకాల ఆకాంక్ష నెరవేర్చిన ఘనత కాంగ్రెస్ పార్టీకే సొంతమన్నారు. దశాబ్ద కాలంగా రేషన్ కార్డుకు నోచుకోని కుటుంబాలకు రేషన్ కార్డులను అందించడం, 200యూనిట్ల ఉచిత విద్యుత్తు అందించడం, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, గ్యాస్ సిలిండర్ కు సబ్సిడీ అందించి ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చుకోవడం కాంగ్రెస్ పార్టీకే చెల్లిందన్నారు. మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సహకారంతో గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే లక్ష్యంగా పనిచేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ పక్కీరు శ్రీనివాస్ రెడ్డి, వార్డు సభ్యులు ఊదరి శ్రీనివాస్, ఐతరాజు శారద లింగస్వామి, రాచకొండ భార్గవ్, జీడిముడ్ల శోభ కొండల్, జంగం వెంకటమ్మ అంజయ్య, మాజీ సర్పంచ్ మాజీ సర్పంచ్ బద్రి లింగయ్య, మాజీ ఉప సర్పంచ్ లు బత్తుల శ్రీహరి, కొంతం బుచ్చిరెడ్డి, కొంతం శ్రీనివాస్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి భాగ్యలక్ష్మి, వివోఏ సంతోష, అంగన్ వాడి పూదరి పారిజాత, ఎంగలి మౌనిక తదితరులు పాల్గొన్నారు.

## ఏఈకి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపిన యాదవ సంఘ నేతలు



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: మండల కేంద్రంలోని విద్యుత్ ఏఈ సతీష్ యాదవ్ ను మండల యాదవ సంఘ నాయకులు బుధవారం కలిశారు. హనూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో జాతీయ యాదవ సంఘ ఉపాధ్యక్షుడు చిలకల శ్రీనివాస్ యాదవ్, యాదవ సంఘ మండల అధ్యక్షుడు చినుకని మల్లేశం యాదవ్, డాక్టర్ చినుకని శివప్రసాద్, నల్ల పర్వతాలు యాదవ్, ప్రధాన కార్యదర్శి గంగనబోయిన వెంకటేష్ యాదవ్, ఉపాధ్యక్షులు ఎర్రసాని సతీష్ యాదవ్, గజ్జి పాండు యాదవ్, గుండెబోయిన వేణు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## వందేళ్లైనా ప్రజాదరణ తగ్గని పార్టీ సిపిఐ : ఎస్.కె. సాబీర్ పాషా



ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: వందేళ్ల చరిత్ర కలిగిన భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) ప్రజా ఉద్యమాలతో ప్రజల్లో అజేయంగా నిలిచిందని, మరో వందేళ్లైనా అదే స్ఫూర్తితో ముందుకు సాగుతామని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్.కె. సాబీర్ పాషా అన్నారు. సిపిఐ శతవసంతాల ముగింపు సందర్భంగా జనవరి 18న ఖమ్మంలో జరగనున్న బహిరంగ సభకు ప్రచారంగా చేపట్టిన జాతా బుధవారం చుంచుపల్లి మండలం గౌతంపూర్ నుంచి కొత్తగూడెం వైపాస్ వరకు భారీ ర్యాలీగా సాగింది. జాతాకు పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు.ఈ సందర్భంగా సాబీర్ పాషా మాట్లాడుతూ, గ్రామీణ ఉపాధి హామీ, సమాచార హక్కు, అటవీ హక్కుల చట్టాలు సిపిఐ పోరాట ఫలితాలేనని తెలిపారు. పేదలు, రైతులు, పోడు సాగుదారుల పక్షాన సిపిఐ ఎల్లప్పుడూ నిలబడిందన్నారు. రాబోయే కొత్తగూడెం కార్పొరేషన్ ఎన్నికల్లో సిపిఐ జనబలంతో విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు.జాతా సందర్భంగా అంబేద్కర్ తదితర నేతల విగ్రహాలకు, తెలంగాణ అమరవీరుల స్థూపానికి నివాళులు అర్పించారు. పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు కార్యక్రమంలో పాల్గొన్నారు.



## అట్టహాసంగా ప్రారంభమైన 69వ జాతీయస్థాయి

# అండర్–17 బాలుర కబడ్డీ పోటీలు

*** క్రీడల్లో గెలుపు–ఓటములు సహజం : : మంత్రి వాకాటి శ్రీహరి**

ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: 69వ జాతీయ స్థాయి అండర్-17 బాలుర కబడ్డీ పోటీలు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పినపాక మండలం ఏడూళ్ళ బయ్యారం గ్రామంలోని జడ్పీహెచ్ఎస్ పాఠశాల ఆవరణలో బుధవారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో, కంది చారిటబుల్ ట్రస్ట్, మౌర్య టెక్ సౌజన్యంతో నిర్వహిస్తున్న ఈ జాతీయస్థాయి క్రీడా పోటీలను రాష్ట్ర పశుసంవర్ధక, పాడి అభివృద్ధి & మత్స్య, క్రీడలు & యువజన సేవల శాఖ మంత్రి వాకాటి శ్రీహరి, పంచాయతీరాజ్ & గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా & శిశు సంక్షేమ శాఖల మంత్రి ధనసరి అనసూయ (సీతక్క), పినపాక శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు, భద్రాచలం శాసనసభ్యులు తెల్లం వెంకట్రావు, జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్, జిల్లా ఎస్పీ రోహిత్ రాజు, భద్రాచలం ఐటిడిఏ పీఓ రాహుల్ తదితరులు ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా జాతీయస్థాయి కబడ్డీ పోటీల ప్రారంభోత్సవానికి జిల్లాకు విచ్చేసిన మంత్రులు వాకాటి శ్రీహరి, ధనసరి అనసూయలకు జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ ఘన స్వాగతం పలికారు. అనంతరం మణుగూరు ప్రధాన కూడలి నుంచి సీఎం టార్చ్ ర్యాలీని మంత్రి వాకాటి శ్రీహరి ప్రారంభించారు. ఈ ర్యాలీలో పెద్ద సంఖ్యలో క్రీడాకారులు, యువకులు, ప్రజలు ఉత్సాహంగా పాల్గొన్నారు.అనంతరం ఏడూళ్ల బయ్యారం జడ్పీహెచ్ఎస్ పాఠశాల ఆవరణలో జ్యోతి ప్రజ్వలన చేసి జాతీయ పతాకాన్ని మంత్రులు ఆవిష్కరించారు. జాతీయ కమిటీ పోటీల సందర్భంగా చిన్నారుల నృత్య ప్రదర్శన అందరిని ఆకట్టుకుంది.అనంతరం బెలూన్లను గాలిలోకి వదిలి జాతీయ కబడ్డీ పోటీలను ప్రారంభించారు.ఈ సందర్భంగా మంత్రి వాకాటి శ్రీహరి మాట్లాడుతూ దేశం నలుమూలల నుంచి వచ్చిన క్రీడాకారులను ఉద్దేశించి "ఈస్ట్ ఆర్ వెస్ట్ - ఇండియా ఇస్ ది బెస్ట్, ఈస్ట్ ఆర్ వెస్ట్ - బయ్యారం ఇస్ ది బెస్ట్, భారత్ మాతాకీ జై" అంటూ నినాదాలు ఇచ్చారు. ఈ క్రీడా సంభరం చూస్తే సంక్రాంతి పండుగ ముందుగానే వచ్చినట్లుగా ఉందన్నారు. కబడ్డీ అనేది మన దేశంలోనే పుట్టిన సంప్రదాయ క్రీడ అని, మన మట్టిలో పుట్టిన ఈ ఆటలు మన సంస్కృతి, సువాసనను ప్రపంచానికి చాటుతాయని అన్నారు. కబడ్డీ చెమటతో, శ్రమతో ఆడే క్రీడ అని, గెలుపు -ఓటములు సహజమని, ప్రతి క్రీడాకారుడు క్రీడాస్ఫూర్తితో పోటీల్లో పాల్గొనాలని సూచించారు. దేశ చరిత్రలో తొలిసారిగా మారుమూల గిరిజన ప్రాంతమైన ఏడూళ్ళ బయ్యారం గ్రామంలో జాతీయస్థాయి కబడ్డీ పోటీలు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేయడం గర్వకారణమన్నారు. ఈ పోటీల ద్వారా బయ్యారం గ్రామం పేరు దేశవ్యాప్తంగా మారుమోగుతుందని తెలిపారు. వాజపేయి ప్రధానమంత్రి గా వున్న కాలంలో భారత్-పాకిస్తాన్ క్రికెట్ మ్యాచ్ సందర్భంగా "గెలుపు -ఓటములకన్నా మనసులు గెలుచుకొని రావాలి" అన్న సందేశాన్ని గుర్తు చేస్తూ, బయ్యారానికి వచ్చిన క్రీడాకారులు కూడా ఇక్కడి ప్రజల మనసులు గెలుచుకొని వెళ్లాలని ఆయన పిలుపునిచ్చారు.మంత్రి ధనసరి అనసూయ (సీతక్క) మాట్లాడుతూ జాతీయస్థాయి కబడ్డీ పోటీలను బయ్యారం గ్రామంలో నిర్వహించేందుకు బాధ్యత తీసుకున్న కంది చారిటబుల్ ట్రస్ట్ సుబ్బారెడ్డి కుటుంబ సభ్యులను ప్రత్యేకంగా అభినందించారు. పినపాక శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ మారుమూల గిరిజన ప్రాంతమైన బయ్యారంలో జాతీయస్థాయి కబడ్డీ పోటీలు నిర్వహించటం ఎంతో సంతోషకరమన్నారు. జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ మాట్లాడుతూ దేశం నలుమూలల నుంచి భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు వచ్చి జాతీయస్థాయి కబడ్డీ పోటీల్లో పాల్గొంటున్న క్రీడాకారులకు ఇది మరచిపోలేని అనుభవంగా నిలుస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖ అధికారి నాగలక్ష్మి, క్రీడా శాఖ అధికారి పరందామరెడ్డి, టోర్నమెంట్ అబ్జర్వర్ నిర్మల్ జంగ్దే,సర్పంచ్ చంద్రరావు, కంది చారిటబుల్ ట్రస్ట్ సుబ్బారెడ్డి, విశ్వ భరత్ రెడ్డి, తాసిల్దార్, ఎంపీడీవో, ఎంపీఓ, క్రీడా శాఖ అధికారులు, విద్యాశాఖ అధికారులు, విద్యార్థులు, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## ఆల్విన్ కాలనీ నూతన కమిషనర్ కలిసిన చంద్రారెడ్డి

శేరిలింగంపల్లి, (ప్రజాస్ఫూర్తి) : ఆల్విన్ కాలనీ నూతన కమిషనర్ గా నియమితులైన చాముండేశ్వరుని బుధవారం కూకట్ పల్లి డివిజన్ పాపిరెడ్డి నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు ఊట్ల చంద్ర రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు కార్యక్రమంలో సీనియర్ నాయకులు మొగుళ్ల కనకా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## కూకట్ పల్లి ట్రాఫిక్ సీఐకి నూతన సంవత్సర శుభాకాంక్షలు




కూకట్ పల్లి, (ప్రజాస్ఫూర్తి) : నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని కూకట్ పల్లి ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ తిమ్మప్పను కూకట్పల్లి జర్నలిస్టులు నాగరాజ్ యాదవ్, మహేందర్ నాయక్, శ్రావణ్ లు మర్యాదపూర్వకంగా శాలువ తో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయనకు హృదయపూర్వక నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేస్తూ, ట్రాఫిక్ నియంత్రణలో ఆయన అందిస్తున్న సేవలను ప్రశంసించారు.ఈ కార్యక్రమంలో వారు మాట్లాడుతూ, కూకట్పల్లి పరిధిలో ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి సిఐ తిమ్మప్ప తీసుకుంటున్న చర్యలు ప్రజలకు ఎంతో ఉపయోగపడుతున్నయని పేర్కొన్నారు. ప్రజల భద్రతకు ప్రాధాన్యం ఇస్తూ, క్రమశిక్షణతో ట్రాఫిక్ నిర్వహణ చేపడుతున్నారని తెలిపారు. అనంతరం సిఐ తిమ్మప్ప ప్రజల సహకారంతో ట్రాఫిక్ వ్యవస్థను మరింత సమర్థవంతంగా నిర్వహిస్తామని అన్నారు.ఈ కార్యక్రమంలో పర్యాటక అభివృద్ధి సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ క్రాంతి వల్లూరు, నిథమ్ డైరెక్టర్ వెంకట రమణ , క్లిక్ ప్రతినిధులు పాల్గొన్నారు

## పోలీసు ఆరోగ్యంగా ఉన్నప్పుడే సమాజంలో మెరుగైన సేవలు

**- జిల్లా ఎస్పీ మహేష్ బి గితే**

**- ముస్తాబాద్ పోలీస్ అధికారులకు, సిబ్బందికి ఉచిత వైద్య శిబిరం**



ప్రజాస్ఫూర్తి, ముస్తాబాద్: ప్రజలకు నిరంతరం సేవలందించే పోలీసుల ఆరోగ్యం అత్యంత ముఖ్యమని, పోలీసులు ఆరోగ్యంగా ఉన్నప్పుడే సమాజానికి మెరుగైన సేవలు అందించగలరని జిల్లా ఎస్పీ మహేష్ బి గితే అన్నారు. ముస్తాబాద్ పోలీస్ స్టేషన్ పోలీస్ అధికారులకు, సిబ్బందికి శ్రీ తిరుమల నర్సింగ్ హోమ్ వారి సౌజన్యంతో బుధవారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా జిల్లా ఎస్పీ హాజరై ప్రారంభించి మాట్లాడారు. శాంతి భద్రతల పరిరక్షణకై నిరంతరం శ్రమించే పోలీసులు తమ వ్యక్తిగత ఆరోగ్యం పట్ల శ్రద్ధ చూపాలన్నారు.ఆరోగ్య పరిరక్షణ కోసం పోలీసులు ఆరోగ్య పరీక్షలకై సమయాన్ని కేటాయించాలన్నారు. విధి నిర్వహణకై అంకితమైన పోలీసుల సంక్షేమన్ని దృష్టిలో ఉంచుకొని ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేయడం జరుగుతుందని, ఈ శిబిరాలను పోలీసులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ శిబిరంలో వైద్యుల బృందం పాల్గొని వివిధ ఆరోగ్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు, ఆరోగ్య సూచనలు అందించారు. రోజువారి పని ఒత్తిడి, ఫీల్డ్ పనులు, రాత్రి పూట డ్యూటీ కారణంగా వివిధ ఆరోగ్య సమస్యలు వచ్చే అవకాశం ఉన్న నేపథ్యంలో ఇలాంటి వైద్య శిబిరాలు పోలీస్ సిబ్బందికి ఎంతో ఉపయుక్తమని వైద్యులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా శ్రీ తిరుమల నర్సింగ్ హోమ్ యాజమాన్యంకు ఎస్పీ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐ మొగిలి, ముస్తాబాద్ ఎస్ఐ గణేష్, పోలీసు సిబ్బంది ఉన్నారు.

# నారాయణ పాఠశాలలో ఘనంగా మాస్టర్ చెఫ్ కార్యక్రమం





ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: పాల్వంచ నెహ్రూ నగర్‌లోని నారాయణ పాఠశాలలో బుధవారం మాస్టర్ చెఫ్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఖమ్మం జిల్లా ఏజీఎం శ్రీ రాంకీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమాన్ని ప్రముఖ వైద్యులు డాక్టర్ సురేష్ పాద్య ముఖ్య అతిథిగా ప్రారంభించారు.ఈ సందర్భంగా డాక్టర్ సురేష్ పాద్య మాట్లాడుతూ, చిన్న వయస్సులో తీసుకునే పోషకాహారం భవిష్యత్ ఆరోగ్యంపై ప్రభావం చూపుతుందని తెలిపారు. జంక్ ఫుడ్‌కు దూరంగా ఉండి సంప్రదాయ వంటకాలకు ప్రాధాన్యం ఇవ్వాలని తల్లిదండ్రులకు సూచించారు. విద్యార్థులకు పోషక విలువలపై అవగాహన కల్పించేందుకు నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని ఆయన అభినందించారు.ఈచాంప్స్ కోఆర్డినేటర్ వినోద లక్ష్మి 'న్యూట్రీడీల్' కార్యక్రమం ద్వారా విద్యార్థులను ఆరోగ్యకరమైన ఆహారానికి అలవాటు చేస్తున్నట్లు తెలిపారు. ప్రధానోపాధ్యాయులు పూరేటి నరసింహారావు పాఠశాలలో జంక్ ఫుడ్‌ను పూర్తిగా నిషేధించి, వాటర్ బెల్ ద్వారా నీరు తాగే అలవాటు పెంపొందిస్తున్నామని చెప్పారు. మాస్టర్ చెఫ్ పోటీల విజేతలకు బహుమతులు, పాల్గొన్నవారికి సర్టిఫికెట్లు అందజేశారు. ఉపాధ్యాయులు, సిబ్బంది సమన్వయంతో కార్యక్రమం విజయవంతంగా ముగిసిందని ఏజీఎం రాంకీ ప్రశంసించారు.

# చింతల్ సర్కిల్ కార్యాలయాన్ని మోడల్ మార్కెట్ లో ఏర్పాటు చేయాలి

*** సిపిఐ మేడ్చల్ జిల్లా కార్యదర్శి ఉమా మహేష్**



జగద్గిరిగుట్ట, (ప్రజాస్ఫూర్తి): జగద్గిరిగుట్ట లో గల మోడల్ మార్కెట్ లో చింతల్ సర్కిల్ కార్యాలయాన్ని ఏర్పాటు చేయాలని సిపిఐ మేడ్చల్ జిల్లా కార్యదర్శి ఉమా మహేష్ అన్నారు. డిప్యూటీ కమిషనర్ సర్కిల్ కార్యాలయాన్ని ఏర్పాటు చేయాలని కోరుతూ బుధవారం సిపిఐ ఆధ్వర్యంలో జోనల్ కమిషనర్ లేనందువల్ల కమిషనర్ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి ఉమా మహేష్, రాష్ట్ర నాయకులు ఏసురత్నం లు మాట్లాడుతూ చింతల్ సర్కిల్ కార్యాలయం కోసం ఇబ్బంది పడుతున్న దృష్ట్యా జగద్గిరిగుట్టలోని మోడల్ మార్కెట్లో మొదటి అంతస్తు ఖాళీగా ఉన్నదని దాంట్లో ఏర్పాటు చేయాలన్నారు. నూతనంగా ఏర్పాటు అయినటువంటి సర్కిల్ కార్యాలయాలకు కార్యాలయాలు అందుబాటులో లేకపోవడం బాధాకరమన్నారు. ప్రభుత్వం అధికారులు,ఉద్యోగులకు కనీస సదుపాయాలు తీర్చకుండా అదరాబాదరగా జోన్లను, సర్కిళ్లను ఏర్పాటు చేసి చేతులు దులుపుకున్నదని, ఇప్పుడు అధికారులు సర్కిల్ కార్యాలయల ఏర్పాటు కోసం బాధపడుతున్నారన్నారు. చింతల్ సర్కిల్ ను గాంధీనగర్ లో ఏర్పాటు చేయడానికి స్థానికులు వ్యతిరేకిస్తున్నటువంటి సందర్భంగా జగద్గిరిగుట్ట మోడల్ మార్కెట్ లోని మొదటి అంతస్తు అన్ని విధాలుగా ఉపయోగపడుతుందన్నారు. అధికారులు పరిశీలించి సర్కిల్ కార్యాలయాన్ని మోడల్ మార్కెట్లో ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల సహాయ కార్యదర్శులు హరినాథ్ రావు, రాములు కోశాధికారి సదానంద్ శాఖ కార్యదర్శిలు సహదేవరెడ్డి, వెంకటేష్, సాయిలు, నరసింహారెడ్డి, చంద్రయ్య, సుంకిరెడ్డి, కృష్ణ, చేతన్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

# ఫిబ్రవరి 25 నుంచి ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు

*** మేడ్చల్ – మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్రెడ్డి,**



మేడ్చల్ ప్రతినిధి, (ప్రజాస్ఫూర్తి) : రాష్ట్ర వ్యాప్తంగా ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం వార్షిక పరీక్షలకు జిల్లా వ్యాప్తంగా అన్ని రకాల వసతులు సమకూర్చి విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా చూడాలని మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి అన్నారు. ఫిబ్రవరి 25 వ తేదీ నుంచి మార్చి 18వ తేదీ వరకు జరగనున్న పరీక్షల నేపథ్యంలో ఇంటర్మీడియట్ పరీక్షలకు సంబంధించి జిల్లాసంబంధిత శాఖల అధికారులు, సిబ్బందితో బుధవారం ముందస్తు ఏర్పాట్లపై సమీక్ష సమావేశం నిర్వహించారు. అదనపు కలెక్టర్ విజయేందర్రెడ్డి తన ఛాంబర్ లో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు థియరీ, ఎథిక్స్, ఎన్విరాన్మెంటల్ ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఫిబ్రవరి 25వ తేదీ నుంచి ప్రారంభమయ్యే ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహించడం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. అలాగే ప్రాక్టికల్స్ పరీక్షలు ఫిబ్రవరి 2వ తేదీ నుంచి 21వ తేదీ వరకు రెండు సెషన్లలో మూడు స్పెల్స్లో జరుగుతాయని దీనికి గాను జిల్లా వ్యాప్తంగా జనరల్, ప్రాక్టికల్స్, ఒకేషనల్ కోర్సులకు పరీక్షలు ఉంటాయని అదనపు కలెక్టర్ విజయేందర్రెడ్డి వివరించారు. ఇంటర్మీడియట్ పరీక్షలకు గాను జిల్లాలో ప్రథమ సంవత్సరంలో జనరల్ విభాగానికి సంబంధించి 64780 మంది విద్యార్థులు, ఒకేషనల్ కోర్సులో 1368 మంది.మొత్తం 66148 మంది పరీక్షలు రాస్తారని... అలాగే ద్వితీయ సంవత్సరంలో జనరల్లో 67792 మంది విద్యార్థులు, ఒకేషనల్ కోర్సులో 1258 మొత్తం 69050 మంది పరీక్షలకు హాజరవుతారని తెలిపారు. జిల్లాలో ఇంటర్మీడియట్ పరీక్షల్లో జనరల్ విభాగానికి సంబంధించి మొత్తం 1,32,572 మంది విద్యార్థులు, ఒకేషనల్ కోర్సులో మొత్తం 2626 మంది మొత్తంగా 1,35,198 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్రెడ్డి స్పష్టం చేశారు. జిల్లా వ్యాప్తంగా ఇంటర్మీడియోట్ పరీక్షలకు గాను 151 పరీక్ష కేంద్రాలు ఉన్నాయన్నారు. పరీక్షలు నిర్వహించే సమయంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగకుండా ఏర్పాట్లు చేయాలని విద్యుత్ శాఖ అధికారులను, పరీక్ష కేంద్రాల వద్ద మెడికల్ క్యాంపులు, ఫస్ట్ ఎయిడ్ బాక్స్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిని, అవసరమైన పోలీసు బందోబస్తీ ఏర్పాటు చేయాలని పోలీస్ శాఖను, పరీక్షా కేంద్రాల నుండి జవాబు పత్రాలను పగడ్బందీగా తీసుకువెళ్లేందుకు పోస్టల్ శాఖ సహకరించాలని, ప్రాంతాల నుండి వచ్చే విద్యార్థులు సమయానికి పరీక్ష కేంద్రాలకు చేరుకునేలా బస్సులను ఏర్పాటు చేయాలని ఆర్టీసీ అధికారులను అదనపు కలెక్టర్ ఆదేశించారు. దీనికి సంబంధించి అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాల్సిందిగా అదనపు కలెక్టర్ విజయేందర్రెడ్డి అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో జిల్లా ఇంటర్మీడియట్ అధికారి ఎం.కిషన్, కళాశాలల ప్రినిసిపల్స్, సంబంధిత శాఖ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు



# విద్యతోనే సమాజంలో ఉన్నతంగా ఎదగవచ్చు

*** ఆరోగ్యంగా ఉంటేనే చదువులో మెరుగైన ఫలితాలు**

*** జిల్లా ఎస్పీ మహేష్ బిగితే**



ప్రజాస్ఫూర్తి, ముస్తాబాద్: విద్యతోనే సమాజంలో ఉన్నతంగా ఎదగవచ్చని రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీ మహేష్ బిగితే అన్నారు. ముస్తాబాద్ పోలీస్ శాఖ ఆధ్వర్యంలో శ్రీ తిరుమల నర్సింగ్ హోమ్ వారి సౌజన్యంతో ముస్తాబాద్ మండల పరిధిలోని జడ్పిహెచ్ఎస్ పాఠశాలలో విద్యార్థినీ, విద్యార్థులకు ఉచిత వైద్య శిబిరం బుధవారం నిర్వహించారు. ఈ ఉచిత వైద్య శిబిరాన్ని జిల్లా ఎస్పీ మహేష్ బి గితే ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా వైద్యులు విద్యార్థులకు పలు రకాల వైద్య పరీక్షలు నిర్వహించి, తగు సలహాలు, సూచనలు ఇచ్చి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ విద్యార్థులు శారీరకంగా,మానసికంగా ఆరోగ్యంగా ఉన్నప్పుడే చదువులో మంచి ఫలితాలు సాధించగలరని తెలిపారు. చిన్న వయస్సులోనే ఆరోగ్యంపై శ్రద్ధ వహించడం, క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవడం ఎంతో అవసరమని సూచించారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యలను ఎంచుకొని క్రమశిక్షణతో కష్టపడి చదివితేనే జీవితంలో విజయాలు సాధ్యమవుతాయని, చదువుతో పాటు మంచి విలువలు, క్రమశిక్షణ అలవర్చుకోవాలని హితవు పలికారు. రోజుకో తరహాలో ప్రస్తుతం పెరుగుతున్న సైబర్ నేరాలపై విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద లింకులు, ఫోన్ కాల్స్, సోషల్ మీడియా మోసాలకు దూరంగా ఉండాలన్నారు. సైబర్ నేరగాళ్లు ప్రస్తుత సమాజంలో ఏఐ ఆధారిత వీడియో మెసేజ్‌ల ద్వారా మోసం చేస్తున్నారని, వాటి పట్ల అప్రమత్తతో వ్యవహరించాలని సూచించారు. విద్యార్థులు సామాజిక మాధ్యమాల్లో అపరిచిత వ్యక్తులతో అప్రమత్తంగా ఉండాలని, వ్యక్తిగత విషయాలు సామాజిక మాధ్యమాల్లో పంచుకోవద్దని తెలిపారు. ఏవైనా సమస్యలు ఎదురైతే వెంటనే తల్లిదండ్రులలకు, ఉపాధ్యాయులకు, పోలీస్ అధికారుల దృష్టికి తీసుకురావాలని తెలిపారు.సైబర్ నేరాలకు మోసపోయిన వెంటనే సైబర్ హెల్ప్ లైన్ నెంబర్ 1930కి కాల్ చేసి ఫిర్యాదు చేయాలన్నారు. సైబర్ నేరాలలో గోల్డెన్ హవర్ ముఖ్యమైనదని మోసపోయిన వెంటనే గ్రహించి ఫిర్యాదు చేసిన యెడల మోసపోయిన డబ్బు ఎక్కువ శాతం తిరిగి వచ్చే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. ఉచిత మెగా వైద్య శిబిరం ఏర్పాటు చేసిన శ్రీ తిరుమల నర్సింగ్ హోమ్ యాజమాన్యంతోపాటు ఇందులో పాల్గొన్న వైద్యులకు, సిబ్బందికి , సురభి వైద్య విజ్ఞాన సంస్థ సిబ్బందిని ఎస్పీ అభినందించారు. ఈ కార్యక్రమంలో సిఐ మొగిలి, ఎంఇఓ రాజిరెడ్డి, ముస్తాబాద్ ఎస్ఐ గణేష్, డాక్టర్లు చంద్రశేఖర్ రావు, శ్రీకాంత్, అనురాధ, స్రవంతి, సురభి వైద్య విజ్ఞాన సంస్థ సిబ్బంది, పాఠశాల ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు

# బలహీనతలకు బానిసకాకూ..!



రచన:
పోలయ్య కవి కూకట్లపల్లి
అత్తాపూర్, హైదరాబాద్

ఓ మిత్రమా..!
నా ప్రియ నేస్తమా..!
ధైర్యంగా ఉండు
గట్టిగా నిలువు...
కానీ...
క్రూరంగా కాదు
మూర్ఖంగా కాదు
మొండిగా అసలే కాదు...
పిరికితనానికి బలైపోకు..!

ఓ మిత్రమా..!
నా ప్రియ నేస్తమా..!
దయగల
హృదయంతో ఉండు
పేదలను ప్రేమించు
అనాథలను ఆదుకో...
కానీ...
బలహీనతలకు
బానిసవైపోకు..!

ఓ మిత్రమా..!
నా ప్రియ నేస్తమా..!
గర్వంగా బ్రతుకు,
గౌరవాన్ని సంపాదించు...
కానీ...
అహంకారపు ముసుగులో
పొగరుబోతుగా మారిపోకు..!

ఓ మిత్రమా..!
నా ప్రియ నేస్తమా..!
రాముడిలా నీతిగా ఉండు
ధర్మాన్ని ఆచరించు...
కానీ...
రావణుడిలా అహంకారంతో
రాక్షసుడిలా జీవ హింసతో
రాబందులా దోచుకునే
వాడివైపోకు..!

# ప్రయాణికులకు TGSRTC బ్యాడ్ న్యూస్.. సంక్రాంతికి భారీగా పెరగనున్న టికెట్ ధరలు




సంక్రాంతి సందర్భంగా తెలంగాణ ఆర్టీసీ ప్రయాణికులకు గుడ్ న్యూస్‌తో పాటు ఓ బ్యాడ్ న్యూస్ చెప్పింది. రాష్ట్రంలో 6431 ప్రత్యేక బస్సులను నడపనున్నట్టు ప్రకటన విడుదల చేసింది. ఈ నెల 9,10,12,13 తేదీల్లో స్పెషల్ బస్సులు నడపాలని సంస్థ నిర్ణయించింది. అదే విధంగా 18,19 తేదీల్లో ప్రయాణికుల తిరుగు ప్రయాణం సందర్భంగా ప్రత్యేక బస్సులు నడిపిస్తున్నట్టు పేర్కొంది. హైదరాబాద్ లోని ప్రధాన రద్దీ ప్రాంతాలైన ఉప్పల్, ఎంజీబీఎస్, జేబీఎస్, ఎల్బీనగర్, మియాపూర్, కేపీహెచ్‌బీ తదితర ప్రాంతాల నుండి స్పెషల్ బస్సులు నడవనున్నట్టు పేర్కొంది. మరోవైపు పండుగ సందర్భంగా టికెట్ ధరలు సైతం పెంచుతున్నట్టు ప్రకటించింది. రాష్ట్ర ప్రభుత్వ జీవో ప్రకారం టికెట్ ధరలు 1:5 వరకు సవరించినట్టు స్పష్టం చేసింది. అంతేకాకుండా మహాలక్ష్మి పథకంలో భాగంగా మహిళలు పల్లెవెలుగు, సిటీ ఎక్స్‌ప్రెస్, ఆర్డినరీ, మెట్రో బస్సుల్లో ఉచితంగానే ప్రయాణించవచ్చని స్పష్టం చేసింది.

# సంక్రాంతి వేళ ప్రయాణికులకు తీపికబురు.. అదనంగా 8 ప్రత్యేక రైళ్లు




సంక్రాంతి పండుగ వేళ రెండు తెలుగు రాష్ట్రాల్లో ప్రయాణికుల రద్దీని దృష్టిలో పెట్టుకుని దక్షిణ మధ్య రైల్వే కీలక నిర్ణయం తీసుకున్నది. ఈ మేరకు 8 అదనపు ప్రత్యేక రైళ్లను నడపాలని డిసైడ్ అయ్యారు. ఈ రైళ్లు హైదరాబాద్ నుంచి సిర్పూర్ కాగజ్‌నగర్, విజయవాడ మధ్య అందుబాటులో ఉంటాయని రైల్వే శాఖ అధికారులు పేర్కొన్నారు. అందులో ట్రైన్ నెంబర్ 07469 హైదరాబాద్ నుంచి సిర్పూర్ కాగజ్‌నగర్ వెళ్లే రైలును మొత్తం నాలుగు ట్రిప్పులు నడుపనున్నారు. జనవరి 9, 10 తేదీల్లో (శుక్ర, శనివారాల్లో) ఉదయం 07:55 గంటలకు బయలుదేరి మధ్యాహ్నం 02.15 గంటలకు గమ్యస్థానానికి చేరుకుంటుంది. ఇక ట్రైన్ నెంబర్ 07470 సిర్పూర్ కాగజ్‌నగర్ నుంచి హైదరాబాద్‌కు జనవరి 9, 18 తేదీల్లో (శుక్ర, ఆదివారాల్లో) మధ్యాహ్నం 15:15 గంటలకు బయలుదేరి రాత్రి 10:20 గంటలకు చేరుకుంటుంది. ఈ ట్రైన్ సికింద్రాబాద్, చర్లపల్లి, భువనగిరి, ఆలేరు, జనగాం, ఘన్‌పూర్, కాజీపేట, ఉప్పల్, జమ్మికుంట, ఓదెల, పెద్దపల్లి, రామగుండం, మంచిర్యాల, బెల్లంపల్లి ఆసిఫాబాద్ రైల్వే స్టేషన్లలో ఆగుతుంది. ఇక ట్రైన్ నెంబర్ 07471 హైదరాబాద్ నుంచి విజయవాడ రైలును మొత్తం నాలుగు ట్రిప్పులు నడుపనున్నారు. జనవరి 9, 10 తేదీల్లో (శుక్ర, శనివారాల్లో) ఉదయం 06:10 గంటలకు బయలుదేరి మధ్యాహ్నం 01:40 గంటలకు గమ్యస్థానానికి చేరుకుంటుంది. అదేవిధంగా ట్రైన్ నెంబర్ 07472 విజయవాడ నుంచి హైదరాబాద్ వెళ్లే రైలు జనవరి 9, 18 తేదీల్లో (శుక్ర, ఆదివారాల్లో) మధ్యాహ్నం 02:40 గంటలకు బయలుదేరి రాత్రి 10:35 గంటలకు గమ్య స్థానానికి చేరుకుంటుంది. ఈ రైలు సికింద్రాబాద్, చర్లపల్లి, జనగాం, ఘన్‌పూర్, కాజీపేట, వరంగల్, నెక్కొండ, కేసముద్రం, మానుకోట (మహబూబాబాద్), డోర్నకల్, ఖమ్మం, మధిర రైల్వే స్టేషన్లలో ఆగుతుంది.



# రైళ్లలో శుభ్రత.. భారీగా పెరిగిన ఫిర్యాదులు

రైళ్లలో శుభ్రతకు సంబంధించి ఇటీవల భారీ సంఖ్యలోఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. గతేడాది సెప్టెంబర్‌తో పోలిస్తే అక్టోబర్, నవంబర్‌లలో కోచ్‌ల శుభ్రత, బెడ్ రోల్స్ గురించి రైల్ మదద్ యాప్‌లో ఫిర్యాదుల సంఖ్య 50శాతం పెరిగినట్లు రైల్వే శాఖ వెల్లడించింది. అదే సమయంలో అద్భుతం, సంతృప్తికరం ఫీడ్‌బ్యాక్‌లు సైతం తగ్గినట్లు పేర్కొంది.

**జోన్లకు రైల్వేశాఖ అలర్ట్**

రైళ్లలో శుభ్రతపై ఫిర్యాదులు పెరగడం, పాజిటివ్ ఫీడ్‌బ్యాక్‌లు తగ్గడంపై రైల్వేశాఖ ఆందోళన వ్యక్తం చేసింది. ఇందుకు కారణాలను గుర్తించడంతోపాటు ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థను మెరుగుపరిచేందుకు తగిన చర్యలు తీసుకోవాలని అన్ని జోన్లకు సూచించింది. ఈ మేరకు రైళ్లలో హౌస్‌కీపింగ్ బాధ్యతలు చూసే జోనల్ ప్రిన్సిపల్ చీఫ్ మెకానికల్ ఇంజినీర్లకు లేఖ రాసింది. బెడ్ రోల్స్‌కు సంబంధించి గతేడాది సెప్టెంబర్‌లో 8,758 ఫిర్యాదులు రాగా.. అక్టోబర్‌లో 13,406, నవంబర్‌లో 13,196 ఫిర్యాదులు వచ్చినట్లు రైల్వేశాఖ వెల్లడించింది. సెప్టెంబర్‌తో పోలిస్తే ఇవి దాదాపు 50శాతం పెరగడం గమనార్హం. కోచ్‌లలో శుభ్రతపై సెప్టెంబర్‌లో 24,758 ఫిర్యాదులు రాగా.. అక్టోబర్‌లో 33,804, నవంబర్‌లో 36,673 ఫిర్యాదులు వచ్చాయి.

## 'గ్రోక్' అసభ్య కంటెంట్ వ్యవహారం.. కేంద్రానికి 'ఎక్స్' నివేదిక!



సోషల్ మీడియా వేదికలో అసభ్యకరమైన, అశ్లీల కంటెంట్‌ను తొలగించాలని 'ఎక్స్'కు కేంద్రం ఇటీవల ఆదేశాలు జారీ చేసిన విషయం తెలిసిందే. ఇందుకు సంబంధించి ప్రభుత్వం ఇచ్చిన గడువు బుధవారం సాయంత్రంతో ముగిసింది. ఈలోగా కేంద్ర ప్రభుత్వానికి 'ఎక్స్' తన నివేదికను అందజేసినట్లు తెలిసింది. దానిని ఐటీ శాఖ పరిశీలిస్తున్నట్లు సంబంధిత వర్గాల సమాచారం. ఎక్స్‌లో అసభ్యకర కంటెంట్‌కు సంబంధించి ఫిర్యాదులు వస్తున్నాయని, వీటిపై ఆయా సామాజిక మాధ్యమ వేదికలదే బాధ్యత అని కేంద్ర ప్రభుత్వం ఇటీవల స్పష్టం చేసింది. స్థానిక ఐటీ చట్టాలను ఉల్లంఘిస్తూ రూపొందించిన, వ్యాప్తి చేసిన కంటెంట్ మొత్తాన్ని తక్షణమే తొలగించాలని పేర్కొంటూ జనవరి 2న ఎక్స్‌కు ఆదేశాలు జారీ చేసింది. అభ్యంతరకర కంటెంట్, యూజర్లు, అకౌంట్లపైనా చర్యలు తీసుకోవాలని, తీసుకున్న చర్యలకు సంబంధించి 72 గంటల్లోగా నివేదికను అందజేయాలని స్పష్టం చేసింది. దీనిపై 'ఎక్స్' ఇటీవల స్పందిస్తూ.. చట్టవిరుద్ధ కంటెంట్ రూపొందించేందుకు గ్రోక్‌ను ఉపయోగించే వారు తదుపరి పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించింది. అయితే, తీసుకున్న చర్యలకు సంబంధించి నివేదిక అందించేందుకు మరికాస్త సమయం ఇవ్వాలని ఎక్స్ చేసిన అభ్యర్థన మేరకు ప్రభుత్వం ఆ గడువును జనవరి 7కు పొడిగించినట్లు తెలిసింది. తాజాగా అది ముగియడంతో 'ఎక్స్' నివేదికలో ఏం పేర్కొందనే విషయం ఆసక్తిగా మారింది.

# ఏప్రిల్ 1 నుంచి జనగణన తొలిదశ ప్రారంభం

* కేంద్ర హోంశాఖ



దేశంలో జనగణన తొలి విడతలో భాగంగా అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో ఏప్రిల్ 1 నుంచి సెప్టెంబర్ 30 వరకు గృహాల లిస్టింగ్ జరుగుతుందని కేంద్ర హోంశాఖ వెల్లడించింది. ప్రతి రాష్ట్రానికి 30 రోజుల వ్యవధి ఉంటుందని తెలిపింది. ఈ మేరకు బుధవారం నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ ప్రక్రియ ప్రారంభానికి ముందు పదిహేను రోజుల పాటు స్వీయ గణనకు ఆప్షన్ కూడా ఉంటుందని తెలిపింది. పదేళ్లకోసారి దేశవ్యాప్తంగా నిర్వహించే జన గణన 2021లో చేపట్టాల్సి ఉండగా.. కొవిడ్ కారణంగా వాయిదా పడింది. తాజాగా దీనిని చేపట్టాలని నిర్ణయించిన కేంద్రం.. రెండు దశల్లో నిర్వహించేందుకు సన్నద్ధమవుతోంది. తొలిదశలో గృహాల లిస్టింగ్, గణన (2026 ఏప్రిల్-సెప్టెంబరు), రెండో దశలో జనాభా లెక్కల సేకరణ (2027 ఫిబ్రవరి మార్చి 1)ను నిర్వహించేందుకు భారీ ఏర్పాట్లు చేస్తోంది. ఈ దఫా జనాభా లెక్కింపు డిజిటల్ విధానంలో నిర్వహించనున్నట్లు కేంద్రం ఇదివరకే స్పష్టం చేసింది. మొబైల్ యాప్‌ల ద్వారా జనాభా లెక్కల సమాచారాన్ని సేకరిస్తామని, స్వీయ గణనకు ఇదెంతో ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొంది. మరోవైపు, జనగణనతోపాటే కుల గణనను కూడా చేపట్టనున్నట్లు కేంద్ర ప్రభుత్వం ఇటీవల వెల్లడించిన విషయం తెలిసిందే.

## కోళ్లు, మేకలవి ప్రాణాలు కావా: వీధికుక్కల అంశంపై సుప్రీం వ్యాఖ్యలు



వీధి కుక్కల వివాదంపై విచారణ చేపట్టిన సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. వీధి కుక్కల రక్షణపై పెద్ద మొత్తంలో పిటిషన్‌లు దాఖలు అవుతుండడంపై అసహనం వ్యక్తం చేసింది. ''అందరూ కుక్కల గురించే ఆలోచిస్తుంటే.. ఇతర జంతువుల జీవితాల సంగతేంటి? కోళ్లు, మేకల గురించి ఎందుకు మాట్లాడరు? వాటివి ప్రాణాలు కావా'' అని ఈ కేసులో కుక్కల రక్షణపై వాదించిన సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్‌ను ప్రశ్నించింది. కుక్కలు కరవబోతున్నాయా లేదా అనే విషయాన్ని అవి దగ్గరకు వచ్చేంతవరకు తెలుసుకోలేమని వ్యాఖ్యానించింది. ఈ సమస్యకు చికిత్స కంటే నివారణే ముఖ్యమన్న అభిప్రాయం వ్యక్తం చేసింది. రోడ్లు, పాఠశాలల వద్ద కుక్కల వల్ల ప్రమాదాలు జరగడంపై సుప్రీం కోర్టు ఆందోళన వ్యక్తం చేసింది. విద్యాసంస్థలు, ఆస్పత్రులు, రైల్వే స్టేషన్లు తదితర ప్రదేశాల్లో కుక్కలు కరుస్తోన్న ఘటనలు పెరిగిపోతున్న నేపథ్యంలో వీధి కుక్కలకు సంతాన నిరోధక శస్త్రచికిత్సలు చేయాలని అధికారులను ఆదేశించింది. దీనిపై న్యాయవాది కపిల్ సిబల్ స్పందిస్తూ.. ప్రపంచవ్యాప్తంగా ఉన్న అన్ని దేశాల్లో కుక్కలకు టీకాలు వేయడం, స్టెరిలైజ్ చేయడం, షెల్టర్లు నిర్మించడం వంటి పద్ధతులతో వీధి కుక్కల సమస్య తగ్గుతోందని తెలిపారు. అయితే భారత్‌లో ఈ పద్ధతులను సరైన విధంగా పాటించకపోవడం, వీధుల్లో చెత్త విపరీతంగా పేరుకుపోవడంతో వీటి బెడద తీవ్రమవుతోందన్నారు. జంతు సంక్షేమ ఎన్‌జీవో(NGO)ల తరఫున హాజరైన న్యాయవాది కాలిన్ గోన్సాల్వ్స్ వాదిస్తూ.. దేశంలో కుక్కకాట్ల సంఖ్యను ఉన్నదానికంటే ఐదు రెట్లు ఎక్కువగా ప్రభుత్వ నివేదికలు చూపుతున్నాయని ఆరోపించారు. కుక్క కాటు ఇంజెక్షన్‌ల సంఖ్యను కూడా సరైన విధంగా లెక్కించట్లేదన్నారు. 2021 నుంచి 19 రాష్ట్రాల్లో రేబిస్ కేసులు లేవన్నారు.

## నిర్మలాసీతారామన్ పేరిట పెట్టుబడి వీడియోలు.. స్పందించిన ఫ్యాక్ట్ చెక్



కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ పేరిట కొన్ని పెట్టుబడి వీడియోలు వైరల్ అవుతున్నాయి. ఆమె కొన్ని పెట్టుబడి పథకాలకు ప్రచారం కల్పిస్తున్నట్టుగా వాటిల్లో ఉంది. దీనిపై ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరోకు చెందిన ఫ్యాక్ట్ చెక్ విభాగం స్పందించింది. ''సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోన్న ఆ వీడియోలు నకిలీవి. ఎలాంటి పెట్టుబడి పథకాలను కేంద్రం కానీ, ఆర్థిక మంత్రికానీ ప్రోత్సహించడం లేదు. అధికారిక పోర్టళ్లు, ఆర్‌బీఐ, సెబీ వంటి నియంత్రణ సంస్థల ద్వారా ఇలాంటి ప్రచారంలోని నిజానిజాలను ధ్రువీకరించుకోవాలి. అలాంటి ప్రకటనల్లో కనిపించే లింక్స్‌ను క్లిక్ చేసేముందు పరిశీలించుకోవాలి. ఎవరికీ ఓటీపీ, బ్యాంకింగ్‌కు సంబంధించిన వ్యక్తిగత వివరాలను షేర్ చేయొద్దు'' అని ప్రజలను హెచ్చరించింది.

## భాజపా కాంగ్రెస్ మధ్య పొత్తు.. ఆ ఎన్నిక కోసం ప్రత్యేక కూటమి..!





రాజకీయ ప్రత్యర్థులైన భాజపా కాంగ్రెస్ పార్టీలు జట్టు కట్టాయి. వినడానికి వింతగా ఉన్నా ఇది నిజం. మహారాష్ట్రలోని అంబర్‌నాథ్ ప్రాంతానికి మేయర్ ఎన్నిక కోసం ఈ రెండు పార్టీలు చేతులు కలిపాయి. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ శిందే నేతృత్వంలోని శివసేనకు అధికారం దక్కకుండా ఉండేందుకు ఈ అరుదైన కూటమి ఏర్పాటయ్యింది. కూటమిలోని 32 మంది కౌన్సిలర్ల మద్దతుతో భాజపాకు చెందిన తేజశ్రీ కరంజులే ఇక్కడ మేయర్ పదవిని చేజిక్కించుకున్నారు. వీరిలో 16 మంది భాజపా, 12 మంది కాంగ్రెస్, నలుగురు ఎన్సీపీ (అజిత్ పవార్ వర్గం)కి చెందిన వారు ఉన్నారు. మేయర్ పదవి కోసం కాంగ్రెస్‌తో భాజపా చేతులు కలపడంపై శిందేకు చెందిన శివసేన పార్టీ తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేసింది. ఎప్పుడూ కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా మాట్లాడే ఆ పార్టీ.. ఇప్పుడు పొత్తు పెట్టుకోవడాన్ని శివసేన ఎమ్మెల్యే బాలాజీ కినికార్ ప్రశ్నించారు. ఇది తమకు వెన్నుపోటు పొడవడమేనని ఆరోపించారు. అయితే, ఈ విమర్శలను భాజపా ఉపాధ్యక్షుడు గులాబ్రావ్ కరంజుల్ పాటిల్ కొట్టిపారేశారు. అంబర్‌నాథ్‌లో శివసేనతో పొత్తుకు తమ పార్టీ ఎన్నో ప్రయత్నాలు చేసిందన్నారు. కానీ, దానినుంచి సానుకూలమైన స్పందన రాలేదన్నారు. ఈ సందర్భంగా శిందే పార్టీపై అవినీతి ఆరోపణలు చేశారు. కాగా.. కొన్ని వారాల క్రితం ఇక్కడ స్థానిక ఎన్నికలు జరిగాయి.

**ఆ వార్తల్లో నిజం లేదు: కాంగ్రెస్ నేత**

అంబర్‌నాథ్ మున్సిపల్ ఎన్నికల్లో భాజపాకాంగ్రెస్ పొత్తు పెట్టుకున్నాయన్న వార్తలను హస్తం పార్టీ నేత సచిన్ సావంత్ తోసిపుచ్చారు. స్థానిక స్థాయిలో శిందే శివసేన పార్టీ అవినీతిపై పోరాడేందుకు పలు పార్టీల నేతలు కలిసివచ్చారన్నారు. ఇందులో స్వతంత్రులు కూడా ఉన్నారని చెప్పారు. భాజపా కాంగ్రెస్ పొత్తు పెట్టుకున్నాయన్న వార్తలు అవాస్తవమని వెల్లడించారు.

## ఎక్కడో కూర్చొని... ఉచిత సలహాలు ఇస్తుంటారు : జైశంకర్ ఘాటు వ్యాఖ్యలు



పాకిస్థాన్ ఉగ్ర దాడులకు ప్రతీకారంగా భారత్ ఆపరేషన్ సిందూర్ చేపట్టిన సమయంలో పశ్చిమ దేశాలు కపటత్వం ప్రదర్శించడంపై విదేశాంగ మంత్రి జై శంకర్ ఘాటు వ్యాఖ్యలు చేశారు. తమకు వేల మైళ్ల దూరంలో ఉన్న ఆ దేశాలు ఉద్రిక్తతల సమయంలో ఆందోళన చెందినట్లు చెప్పాయని.. కానీ అవేవీ తమ సొంత ప్రాంతంలో జరుగుతున్న వాటిని పట్టించుకోవడం లేదని విమర్శించారు. లక్సెంబర్గ్‌లోని భారత కమ్యూనిటీ సభ్యులతో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. సాయం చేయాలనుకునే వారితో కలిసి పని చేసేందుకు భారత్ సిద్ధంగా ఉంటుందని జైశంకర్ పేర్కొన్నారు. అదే.. పాకిస్థాన్‌లా ప్రవర్తిస్తే మాత్రం వాటికి అలాగే సమాధానం చెబుతామని ఘాటు వ్యాఖ్యలు చేశారు. ప్రపంచంలోని ఇతర ప్రాంతాల్లో జరిగే పరిణామాలు దేనిని ఏమేరకు ప్రభావితం చేస్తాయో చెప్పడం కష్టమన్నారు. ఆలోచన లేకుండా ఎక్కడో దూరంగా కూర్చొన్నవారు.. ఉచిత సలహాలు ఇస్తున్నారని, అవి కొన్నిసార్లు స్వార్థంగా, నిర్లక్ష్యంగా ఉంటున్నాయన్నారు. ప్రస్తుతం చాలా దేశాలు తమ స్వార్థం కోసం మాత్రమే పని చేస్తున్నాయన్నారు. ఆపరేషన్ సిందూర్ సమయంలో ఎలా వ్యవహరించాలనే దానిపై పలు దేశాలు భారత్‌కు సలహాలు ఇచ్చాయన్నారు. కానీ అవేవీ పట్టించుకోకుండా దేశ భద్రత కోసం భారత్ ముందుకుసాగిందన్నారు.

## ముసుగుతో వచ్చే కస్టమర్లకు ఆభరణాలు విక్రయించం



జ్యువెల్లరీ దుకాణాల్లో చోరీలను అరికట్టే ప్రయత్నంలో భాగంగా బిహార్‌లోని ఓ ఆభరణాల వర్తక సంఘం కీలక నిర్ణయం తీసుకుంది. మాస్కులు, హిజాబ్, హెల్మెట్ వంటి వాటితో ముఖాలను కప్పుకొని షాపుల్లోకి వచ్చే కస్టమర్లకు ఆభరణాలు చూపించడం, విక్రయించకూడదని నిర్ణయించింది. దీనిని రాష్ట్రంలో తక్షణమే అమలు చేస్తున్నట్లు ఆ రాష్ట్ర ఆల్ ఇండియా జ్యువెల్లర్స్ అండ్ గోల్డ్‌స్మిత్ ఫెడరేషన్ భాగం వెల్లడించింది. ''ముఖాలకు కప్పుకొని వచ్చే కస్టమర్లకు ఆభరణాలు విక్రయించవద్దని నిర్ణయించాం. హిజాబ్, మాస్కులు, హెల్మెట్ తదితర వాటితో ముఖం కనిపించకుండా షాపుల్లోకి వచ్చే వారికి విలువైన ఆభరణాలు చూపించం. వినియోగదారులు, జ్యువెల్లరీ యజమానుల భద్రతను దృష్టిలో ఉంచుకొని ఈ నిర్ణయం తీసుకున్నాం'' అని ఏఐజేజీఎఫ్ రాష్ట్ర విభాగం అధ్యక్షుడు అశోక్ కుమార్ వర్మ వెల్లడించారు. ముఖాలకు ముసుగుతో వచ్చే వారిని గుర్తించే పరిస్థితి లేదని, ఏదైనా దొంగతనం జరిగినప్పుడు సీసీటీవీ ఫుటేజీల సాయంతో గుర్తుపట్టేందుకు ఈ నిర్ణయం దోహదపడుతుందన్నారు.

## సుక్మా జిల్లాలో 26 మంది మావోయిస్టుల లొంగుబాటు





చర్ల: ఛత్తీస్‌గఢ్‌లో 26 మంది మావోయిస్టులు లొంగిపోయారు. సుక్మా జిల్లా ఎస్పీ కిరణ్ చవాన్ ఎదుట బుధవారం సరెండర్ అయ్యారు. వీరిలో ఏడుగురు మహిళలు ఉన్నారు. లొంగిపోయిన మావోయిస్టుల్లో 13 మందిపై రూ.64 లక్షల రివార్డు ఉన్నట్లు ఎస్పీ తెలిపారు. పీపుల్స్ లిబరేషన్ గెరిల్లా ఆర్మీ బెటాలియన్, సౌత్ బస్తర్ డివిజన్, మడ్ డివిజన్, ఆంధ్రా ఒడిశా డివిజన్‌కు చెందిన మావోయిస్టులు లొంగిపోయిన వారిలో ఉన్నారని ఎస్పీ కిరణ్ చవాన్ తెలిపారు. అబూజ్‌మడ్, సుక్మా, ఒడిశా సరిహద్దుల్లో జరిగిన పలు హింసాత్మక ఘటనల్లో వీరి పాత్ర ఉందని పేర్కొన్నారు. అజ్ఞాతంలో ఉన్న మిగతా మావోయిస్టులు కూడా హింసా మార్గాన్ని వీడి జనజీవన స్రవంతిలో కలవాలని పిలుపునిచ్చారు.

# జాగృతి 'రూట్ మ్యాప్' సిద్ధం.. ఎజెండా కమిటీతో కవిత జూమ్ కాన్ఫరెన్స్

తెలంగాణ సమగ్రాభివృద్ధి కోసం తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఎజెండా కమిటీ సభ్యులతో జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. నీళ్లు, నిధులు, నియామకాలతో పాటు 32 అంశాలపై అధ్యయనానికి ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేశారు. తెలంగాణ ఆవిర్భావం తర్వాత పరిపాలించిన బీఆర్ఎస్, కాంగ్రెస్ వైఫల్యాలు, అన్ని పార్టీల రాజ్యాంగాల అధ్యయనం చేయాలని కమిటీలకు సూచించారు. క్షేత్ర స్థాయిలో కమిటీ సభ్యులు అధ్యయనం చేసి ఈ నెల 17వ తేదీ వరకు నివేదిక



ఇవ్వాలన్నారు. స్టీరింగ్ కమిటీ ఇచ్చే నివేదిక ప్రకారం జాగృతి రాష్ట్ర విస్తృత స్థాయి కార్యవర్గ సమావేశం నిర్వహించి తదుపరి నిర్ణయం తీసుకుంటామని కమిటీలకు తెలిపారు. ఇదిలా ఉంటే తెలంగాణ జాగృతిని రాజకీయ పార్టీగా విస్తరిస్తామని ఇప్పటికే కవిత ప్రకటించిన సంగతి తెలిసిందే. తన ఎమ్మెల్సీ పదవికి సైతం ఆమె రాజీనామా చేశారు. దీంతో కవిత పూర్తిగా తెలంగాణ జాగృతిపై దృష్టి పెట్టినట్లు కనిపిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే జాగృతి నేతలతో వరుస సమావేశాలు నిర్వహిస్తున్నారు.

## తెలంగాణలో 20 మంది ఐపీఎస్‌లు బదిలీ.. 4 కమిషనరేట్లలో డీసీపీల నియామకం

హైదరాబాద్: తెలంగాణలో 20 మంది ఐపీఎస్‌లు బదిలీ అయ్యారు. నాలుగు కమిషనరేట్లలో కొత్తగా ఏర్పడిన జోన్లకు డీసీపీలను ప్రభుత్వం కేటాయించింది. ఈ మేరకు ఐపీఎస్‌లను బదిలీ చేస్తూ సీఎస్ ఉత్తర్వులు జారీ చేశారు.




*** బదిలీ అయిన ఐపీఎస్‌లు వీరే..**

>> దక్షిణ రేంజ్ అదనపు సీపీగా తఫ్సీర్ ఇక్బాల్
>> ఉత్తర రేంజ్ జాయింట్ సీపీగా శ్వేత
>> స్పెషల్ బ్రాంచ్ జాయింట్ సీపీగా విజయ్ కుమార్
>> కూకట్‌పల్లి డీసీపీగా రితిరాజ్
>> చేవెళ్ల యోగేశ్ గౌతమ్
>> మహేశ్వరం జోన్ (ఫ్యూచర్ సిటీ కమిషనరేట్) కె. నారాయణ రెడ్డి
>> ఎల్బీనగర్ అనురాధ
>> ఉప్పల్ జోన్ సురేశ్ కుమార్
>> సికింద్రాబాద్ కె. రక్షిత
>> కుత్బుల్లాపూర్ ఎన్. కోటిరెడ్డి
>> చార్మినార్ జోన్ కిరణ్ ప్రభాకర్
>> శేరిలింగంపల్లి సీహెచ్ శ్రీనివాస్
>> మల్కాజిగిరి జోన్ శ్రీధర్
>> ఖైరతాబాద్ జోన్ శిల్పవల్లి
>> రాజేంద్ర నగర్ శ్రీనివాస్
>> గోల్కొండ జోన్ చంద్ర మోహన్
>> జూబ్లీ హిల్స్ జోన్ రమణా రెడ్డి
>> శంషాబాద్ జోన్ రాజేశ్
>> షాద్‌నగర్ (ఫ్యూచర్ సిటీ కమిషనరేట్) శిరీష
>> సిద్దిపేట సీపీగా సాధనా రశ్మి పెరుమాళ్

## హైదరాబాద్‌లో డ్రగ్స్ పార్టీ.. దొరికిపోయిన ఏఆర్ కానిస్టేబుల్

హైదరాబాద్: గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలో డ్రగ్స్ పార్టీ జరుగుతుందన్న పక్కా సమాచారంతో ఈగల్ టీమ్ సోదాలు నిర్వహించింది. కొండాపూర్ మసీద్‌బండ సమీపంలో ఉన్న కోవే స్టేస్‌లో కొందరు వ్యక్తులు డ్రగ్స్ తీసుకుంటున్నట్లు తెలియడంతో ఈగల్ టీమ్ ఆకస్మిక దాడి చేసింది. సోదాల సమయంలో.. అక్కడ మద్యం సేవిస్తున్న ఏడుగురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారికి డ్రగ్ కిట్స్ ద్వారా పరీక్షలు నిర్వహించగా..ఏడుగురిలో ఐదుగురికి గంజాయి పాజిటివ్ వచ్చింది. వీరిలో హైదరాబాద్‌కు చెందిన ఏఆర్ కానిస్టేబుల్ కూడా ఉండటం గమనార్హం. పట్టుబడిన వారిలో నలుగురు స్నేహితులు ఉన్నారు. వారంతా 2019లో హోటల్ మేనేజ్‌మెంట్ పూర్తి చేశారు. గతంలో ఓ స్నేహితుడి పెళ్లి వేడుకకు వెళ్లిన సమయంలో వీరు



మొదటిసారి డ్రగ్స్ రుచి చూశారు. ఆ సరదా.. కాలక్రమేణా వ్యసనంగా మారింది. అప్పటి నుంచి ఈ నలుగురూ తరచూ ఒకచోట చేరి డ్రగ్స్ సేవించడం అలవాటుగా మార్చుకున్నట్లు పోలీసులు గుర్తించారు. నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు.. వారికి డ్రగ్స్ ఎక్కడి నుంచి సరఫరా అవుతుందనే కోణంలో విచారణ వేగవంతం చేశారు.




## హైదరాబాద్‌లో 13 నుంచి పతంగుల పండగ, స్వీట్ ఫెస్టివల్

హైదరాబాద్: సంక్రాంతి నేపథ్యంలో అంతర్జాతీయ పతంగుల పండగ, స్వీట్ ఫెస్టివల్, హాట్ ఎయిర్ బెలూన్ ఫెస్టివల్, డ్రోన్ షోలను నిర్వహిస్తున్నట్లు పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. సెలబ్రేట్ ది స్కై పేరుతో సంక్రాంతి సంబురాలు జరుగుతాయని తెలిపారు. బుధవారం సచివాలయంలో విలేకరుల సమావేశంలో మంత్రి మాట్లాడారు. పర్యాటక రంగంలో పెట్టుబడులు ఆకర్షించేందుకు రాయితీలు కల్పిస్తున్నట్లు మంత్రి తెలిపారు. పీపీపీ విధానంలో పర్యాటకాన్ని అభివృద్ధి చేసేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని, టూరిజం కాన్‌క్లేవ్, గ్లోబల్ సమిట్ ద్వారా రూ.22,324 కోట్ల పెట్టుబడి ఒప్పందాలు జరిగాయని, వీటి ద్వారా సుమారు 90వేల ఉద్యోగాల కల్పనే లక్ష్యమన్నారు. సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో జనవరి 13 నుంచి 15 వరకు నిర్వహించే అంతర్జాతీయ పతంగుల పండగలో 19 దేశాల నుంచి 40 మంది అంతర్జాతీయ కైట్ ఫ్లయర్స్, దేశంలోని 15 రాష్ట్రాలకు చెందిన 55 జాతీయ కైట్ ఫ్లయర్స్ పాల్గొంటారని తెలిపారు. పతంగుల పండుగ సందర్భంగా పరేడ్ గ్రౌండ్‌లో స్వీట్ ఫెస్టివల్, చేనేత హస్తకళల ప్రదర్శన ఉంటుందన్నారు.

## మున్సిపల్ ఎన్నికలపై ఈసీ కసరత్తు.. ఈనెల 16 నాటికి ఓటర్ల తుది జాబితా

హైదరాబాద్: రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికలకు రంగం సిద్ధమవుతోంది. ఈ నెల 20వ తేదీలోగా నోటిఫికేషన్ విడుదలయ్యే అవకాశం ఉంది. అందుకు తగ్గట్టుగా ప్రభుత్వం, రాష్ట్ర ఎన్నికల కమిషన్ కసరత్తు మొదలు పెట్టాయి. ఇందులో భాగంగా మున్సిపల్ ఎన్నికలపై ఉన్నతాధికారులతో ఎస్ఈసీ రాణికుముదిని బుధవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఓటర్ల జాబితా సవరణ గడువును రాష్ట్ర ఎన్నికల సంఘం పొడిగించింది. ఈ నెల 13 నాటికి పోలింగ్‌స్టేషన్ల వివరాల ముసాయిదా




ప్రచురించాలని ఎస్ఈసీ ఆదేశించారు. ఈ నెల 16 నాటికి ఓటర్ల తుది జాబితా ప్రచురించాలని స్పష్టం చేశారు. బ్యాలెట్ బాక్సులు, సిబ్బంది నియామకంపై చర్చించారు. ఇప్పటికే జిల్లా, మండల స్థాయిలో రాజకీయ పార్టీలతో సమావేశాలు నిర్వహించిన ఈసీ.. గురువారం రాజకీయ పార్టీల రాష్ట్ర స్థాయి ప్రతినిధులతో సమావేశం కానుంది. తెలంగాణలో గడువు ముగిసిన 117 మున్సిపాల్టీ పాలకవర్గాలకు ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించిన సంగతి తెలిసిందే.

## యూనివర్శిటీ భూములను కాజేసేందుకు రేవంత్ ప్రభుత్వం కుట్రలు : కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

బడ్జెట్ కేటాయింపులు లేకుండా విద్యావ్యవస్థను ధ్వంసం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం తాజాగా యూనివర్సిటీల భూములను కాజేయడంపై మిషన్ మోడ్'లో పనిచేస్తోందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఆరోపించారు. బుధవారం ఎక్స్‌వేదికగా స్పందిస్తూ.. ఇటీవల హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూములను ప్రైవేటు పరం చేసేందుకు అటవీ సంపదను, జీవవైవిధ్యాన్ని లెక్కచేయకుండా ఆ భూమిని చదును చేసేందుకు ప్రయత్నించిందన్నారు. సుప్రీంకోర్టు జోక్యం చేసుకుని మొట్టికాయలు వేస్తే వెనక్కు తగ్గిందని పేర్కొన్నారు. తాజాగా గచ్చిబౌలిలోని ప్రఖ్యాత మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీ భూములపై కన్నేసిందన్నారు. యూనివర్సిటీలోని 50 ఎకరాలను వెనక్కు తీసుకుని మళ్లీ ప్రైవేటుకు కట్టబెట్టేందుకు రంగం సిద్ధం చేసిందన్నారు. యూనివర్సిటీల వద్ద భూమి ఉంటే భవిష్యత్ అవసరాలకోసం, విద్యార్థులకు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కల్పించేందుకు ఉపయోగపడుతుందని, ప్రభుత్వ ఖజానాను నింపేందుకు వాడుకోవాల్సిన అవసరం లేదన్నారు. ల్యాండ్ బ్యాంక్ పెంచుకోవడం యూనివర్సిటీ భూములను ఆర్థిక దోపిడీకి వాడుకోవడంపైనే రేవంత్ రెడ్డి సర్కారు ఆసక్తి చూపిస్తోంది. రాష్ట్రంలో విద్యావ్యవస్థ, వర్సిటీల పురోగతిని మాత్రం అంధకారంలోకి నెట్టేస్తోందని



మండిపడ్డారు.

## తమిళనాడు, పుదుచ్చేరి అసెంబ్లీ ఎన్నికలు.. ఏఐసీసీ పరిశీలకుడిగా ఉత్తమ్

హైదరాబాద్: తమిళనాడు, పుదుచ్చేరి అసెంబ్లీ ఎన్నికలకు ఏఐసీసీ పరిశీలకుడిగా తెలంగాణ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి నియమితులయ్యారు. నాలుగు రాష్ట్రాల్లో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల పర్యవేక్షణకు ఏఐసీసీ సీనియర్ పరిశీలకులను నియమించింది. అస్సాం, కేరళ, తమిళనాడు, పుదుచ్చేరి, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల్లో త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో అస్సాం ఎన్నికల పరిశీలకులుగా భూపేష్ భగేల్, డీకే శివకుమార్, బంధు టిర్కి, కేరళకు సచిన్ పైలెట్, కేజె జార్జ్, ఇమ్రాన్, కన్హయ్య కుమార్, తమిళనాడు, పుదుచ్చేరికి పరిశీలకులుగా ముఖుల్ వాస్నిక్, ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఖాజి మహ్మద్ నిజాముద్దీన్.. పశ్చిమ



బెంగాల్‌కు సుదీప్ రాయ్ భర్మన్, షకీల్ అహ్మద్ ఖాన్, ప్రకాష్ జోషిని నియమించినట్లు ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ ఓ ప్రకటనలో తెలిపారు.

## ఆరోగ్యం, పారిశుద్ధ్యంపై అవగాహన కార్యక్రమం

*** పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించిన అడిషనల్ కమిషనర్ రఘుప్రసాద్**

తెలంగాణ బ్యూరో: జీహెచ్ఎంసీ విస్తరణ నేపథ్యంలో నూతనంగా నియమితులైన జోనల్ కమిషనర్లు, అసిస్టెంట్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లకు ఆరోగ్యం, పారిశుద్ధ్యంపై సమగ్ర ఓరియెంటేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమం ద్వారా నగరంలోని ప్రజారోగ్యం, పారిశుద్ధ్య మౌలిక వసతులు, అమలులో ఉన్న కార్యక్రమాలపై విస్తృత అవగాహన కల్పించారు. ఈ వివరాలను అడిషనల్ కమిషనర్ రఘుప్రసాద్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ ఓరియెంటేషన్‌లో సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ విభాగానికి చెందిన ఏఈలు/డీఈఈలు, అసిస్టెంట్ మెడికల్ ఆఫీసర్స్ ఆఫ్ హెల్త్ (ఏఎంఓహెచ్), వెటర్నరీ డైరెక్టర్లు, సీనియర్ మరియు అసిస్టెంట్ ఎంటమాలజిస్టులు, కన్సెషనైర్ ఏజెన్సీల ప్రతినిధులు, నిర్మాణ వ్యర్థాల ఆపరేటర్లు, జోనల్ కమిషనర్లు, జోనల్ అదనపు కమిషనర్లు, ఆరోగ్యం & పారిశుద్ధ్య అదనపు కమిషనర్, విభాగాధిపతులు మరియు హెడ్ ఆఫీస్ సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా రఘుప్రసాద్ మాట్లాడుతూ 2,053 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో, 12 జోన్లు, 60 సర్కిళ్లు, 300 వార్డులలో నివసిస్తున్న 1.34 కోట్ల జనాభాకు జీహెచ్ఎంసీ అందిస్తున్న పారిశుద్ధ్య సేవలపై వివరించారు. నగరంలో రోజుకు సగటున 9,100 మెట్రిక్ టన్నుల వ్యర్థాలు ఉత్పత్తి అవుతుండగా, వ్యక్తి ప్రాతిపదికన వ్యర్థాల ఉత్పత్తి 680.59 గ్రాములుగా ఉందని తెలియజేశారు. శానిటేషన్ వర్కర్లు, స్వీపింగ్ గ్రూప్స్, శానిటరీ ఫీల్డ్ అసిస్టెంట్లు, శాశ్వత పబ్లిక్ హెల్త్ సిబ్బంది, సానిటరీ ఇన్‌స్పెక్టర్లు, జవాన్లు, సూపర్వైజర్లతో కూడిన బలమైన కార్యాచరణ వ్యవస్థపై అవగాహన కల్పించారు. రాంకీ ఎన్విరో ఇంజినీర్స్ లిమిటెడ్ (రీల్)తో పీపీపీ విధానంలో అమలవుతున్న సమగ్ర వ్యర్థాల నిర్వహణ వ్యవస్థ, ప్రాథమిక, ద్వితీయ, తృతీయ సేకరణ విధానాలు, వాహనాల వినియోగం, అలాగే జవహర్‌నగర్ (48 మెగావాట్లు - అదనంగా 24 మెగావాట్లు ప్రగతిలో), దుండిగల్ (14.5 మెగావాట్లు) వ్యర్థాల నుంచి విద్యుత్ ఉత్పత్తి కేంద్రాల వివరాలు తెలియజేశారు.




## లైసెన్స్‌లు రద్దు చేస్తాం.. ఆహార పదార్థాల కల్తీపై సీపీ సజ్జనార్ వార్నింగ్

ఆహార పదార్థాల కల్తీపై హైదరాబాద్ సీపీ సజ్జనార్ సీరియస్ అయ్యారు. ఫుడ్ కల్తీకి పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కల్తీని నిరోధించడానికి పోలీస్, ఫుడ్ సేఫ్టీ అధికారులతో ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి ఎస్వోపీ అమలు చేస్తామని వెల్లడించారు. పదే పదే కల్తీలకు పాల్పడితే లైసెన్సులు సైతం రద్దు చేస్తామని చెప్పారు. అవసరమైతే పీడి యాక్ట్ కూడా ప్రయోగిస్తామని కల్తీ రాయుళ్లను హెచ్చరించారు. ఇదిలా ఉంటే రోజురోజుకు ఆహార పదార్థాల కల్తీ పెరుగుతోంది. ప్రతి ఆహార పదార్థాన్ని కల్తీ చేస్తూ మార్కెట్ లో యథేచ్ఛగా అమ్మేస్తున్నారు.

## బంగారం తరహాలో.. వెండికీ హాల్ మార్కింగ్ తప్పనిసరి..

### యోచనలో కేంద్రం



**న్యూఢిల్లీ:** మార్కెట్‌లో వెండికి డిమాండ్ పెరిగింది. వైట్ మెటల్ ధరలు రోజురోజుకూ భారీగా పెరుగుతున్నాయి. బంగారాన్ని మించి వెండి ధర పరుగులు పెడుతోంది. ప్రస్తుతం మార్కెట్‌లో కిలో వెండి ధర రూ.2.51 లక్షలకుపైనే పలుకుతోంది. ఈ నేపథ్యంలో కేంద్రం కీలక ఆలోచన చేసింది. ధరలు పెరుగుతున్న నేపథ్యంలో వినియోగదారులు మోసాలబారిన పడకుండా ఉండేందుకు బంగారం తరహాలోనే వెండికి కూడా హాల్‌మార్కింగ్ తప్పనిసరి చేయాలని యోచిస్తోంది.

ప్రస్తుతం మార్కెట్‌లో వెండి ఆభరణాలకు హాల్‌మార్కింగ్ తప్పనిసరి లేదు. కానీ ప్రస్తుతం ధరలు పెరుగుతుండటంతో వెండికి కూడా తప్పనిసరిగా హాల్‌మార్కింగ్ ఉండాలని పరిశ్రమ వర్గాల నుంచి డిమాండ్ పెరుగతోంది. అందుకు తగ్గట్టుగా నిబంధనలు తీసుకొచ్చేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు బీఐఎస్ డైరెక్టర్ జనరల్ సంజయ్ గార్గ్ తెలిపారు. కొత్త నిబంధనలు రూపొందించే ముందు అవసరమైన వనరులపై అంచనా వేయనున్నట్లు వివరించారు. ఆ తర్వాతే దీనిపై నిర్ణయం తీసుకోనున్నట్లు తెలిపారు.

## మహిళా బిలియనీర్‌కు ఒక్క రోజులో రూ.800 కోట్లు తెచ్చిన టాటా



**ముంబై:** స్టాక్ మార్కెట్ బుధవారం క్షీణతతో ట్రేడవుతోంది. అయితే స్టాక్ మార్కెట్ క్షీణతలో కూడా టాటా గ్రూప్ కంపెనీ చెందిన టైటాన్ షేర్లు సంచలనం సృష్టిస్తున్నాయి. బుధవారం ఉదయం స్టాక్ మార్కెట్లో ట్రేడింగ్ స్టార్ట్ అయిన వెంటనే, ఈ షేర్ రాకెట్ వేగంతో దూసుకెళ్లడం ప్రారంభించింది. ఈ షేరు విలువ అపారంగా పెరగడంతో, స్టాక్ మార్కెట్ బిగ్ బుల్‌గా పిలిచే దివంగత పెట్టుబడిదారు రాకేష్ జుంజున్వాలా భార్య బిలియనీర్ రేఖ జుంజున్వాలాకు ఒకేసారి దాదాపు రూ.800 కోట్ల సంపద కలిసి వచ్చింది.

టైటాన్ కంపెనీ షేరు మునుపటి ముగింపు రూ.4112తో పోలిస్తే, ఈ రోజు షేర్ విలువ బలమైన పెరుగుదలతో రూ.4225 వద్ద ప్రారంభమైంది. ఆ తర్వాత ఈ షేర్ మరింత వేగంగా దూసుకుపోతూ రూ.4309.30 స్థాయికి చేరుకుంది. నిజానికి ఇది టైటాన్ షేర్ 52 వారాల గరిష్ట స్థాయి. ఈ పెరుగుదల అనేది కంపెనీ మార్కెట్ క్యాప్‌పై కూడా సానుకూల ప్రభావం చూపింది. ప్రస్తుతం ఈ కంపెనీ మార్కెట్ వ్యాల్యూ అనేది రూ.3.82 లక్షల కోట్లకు పెరిగింది. గత ఐదు సంవత్సరాలలో ఈ స్టాక్ రూ.2,754 లాభపడింది, అలాగే పెట్టుబడిదారులకు 178% రాబడిని అందించింది. టాటా స్టాక్ గత సంవత్సరంలో 23%, ఆరు నెలల్లో 18%, ఒక నెలలో 14% లాభపడిందని మార్కెట్ నిపుణులు వెల్లడించారు. ఇంత వేగంగా ఈ షేర్ వ్యాల్యూ పెరుగుదలకు గల కారణాల గురించి మార్కెట్ నిపుణులు మాట్లాడుతూ.. డిసెంబర్ త్రైమాసికంలో కంపెనీ స్టాండ్-ఎలోన్ ఆదాయంలో 40% కంటే ఎక్కువ వృద్ధిని నమోదు చేసింది. మంగళవారం టైటాన్ తాజా త్రైమాసిక ఫలితాలను ప్రకటించింది. ఈ కంపెనీ ఖ3లో వార్షిక ప్రాతిపదికన 41% వృద్ధిని నమోదు చేసిందని తెలియజేసింది. దివంగత పెట్టుబడిదారు రాకేష్ ఝున్‌ఝున్‌వాలా భార్య రేఖ ఝున్‌ఝున్‌వాలాకు టాటా గ్రూప్‌లోని టైటాన్ కంపెనీలో వాటా ఉంది. పలు నివేదికల ప్రకారం.. సెప్టెంబర్ 30, 2025 వరకు ఆమెకు ఈ కంపెనీలో 5.32% వాటా ఉంది. ఈ వాటాలో భాగంగా ఆమెకు 47,293,470 టైటాన్ స్టాక్‌లు ఉన్నాయి. నిన్నటి ట్రేడింగ్ రోజున స్టాక్‌లకు సంబంధించి ఆమె వాటా విలువ రూ.19,416 కోట్లుగా ఉండగా, బుధవారం పెరిగిన విలువతో వాటి వ్యాల్యూ రూ.20,212 కోట్లకు చేరుకుంది. ఆమె తక్కువ టైంలోనే రూ.800 కోట్లకు పైగా ఈ స్టాక్స్ ద్వారా సంపాదించిందని మార్కెట్ వర్గాలు వెల్లడించాయి.

## ఒప్పో సబ్‌బ్రాండ్‌గా రియల్‌మీ..




**న్యూఢిల్లీ:** ప్రముఖ చైనా మొబైల్ కంపెనీ రియల్‌మీ మరో చైనీస్ కంపెనీ ఒప్పో గూటికి చేరింది. ఇకపై ఒప్పో సబ్ బ్రాండ్‌గా కార్యకలాపాలు నిర్వహించనుంది. ఈ విలీనం ద్వారా వనరులను సమర్థవంతంగా వాడుకుంటూ, మార్కెట్లో మరింత వృద్ధి చెందాలని ఇరు సంస్థలు లక్ష్యంగా పెట్టుకున్నాయి. విలీనం తర్వాత రియల్‌మీ నుంచి రావాల్సిన ఫోన్లు షెడ్యూల్ ప్రకారమే విడుదల కానున్నాయి. విక్రయానంతర సేవలు ఒప్పోలో విలీనం కానున్నాయి.

బడ్జెట్ సెగ్మెంట్‌లో షావోమీకి పోటీగా స్మార్ట్‌ఫోన్‌లను లాంచ్ చేసి గుర్తింపు తెచ్చుకున్న రియల్‌మీకి.. భారత్‌తో పాటు ఆగ్నేయాసియా, యూరప్‌లో మంచి మార్కెట్ ఉంది. ఖర్చులను తగ్గించుకోవడంలో భాగంగా తాజా నిర్ణయం తీసుకుంది. ఇప్పటికే వన్‌ప్లస్ కూడా ఒప్పో సబ్‌బ్రాండ్‌గా కొనసాగుతోంది. మరోవైపు ఒప్పో, వివో సంస్థలకు బీబీకే ఎలక్ట్రానిక్స్ సంస్థ మాతృ సంస్థగా వ్యవహరిస్తోంది. అంటే పేరుకే పోటీ కంపెనీలుగా చలామణీ అవుతున్నా.. ఒకే గ్రూప్‌నకు చెందిన కంపెనీలన్నమాట! పేర్లు వేరైనా తమ తమ మార్కెటింగ్ వ్యూహాలతో ముందుకెళుతున్నాయి.

## ఏసీఏ ఉమెన్ టీమ్ మెంటార్‌గా మిథాలీ రాజ్

### ఏసీఏ అధ్యక్షుడు కేశినేని శివనాథ్

### ఏడాది కాలంలో ఏసీఏను గణనీయంగా అభివృద్ధి చేశామన్న అధ్యక్షుడు కేశినేని శివనాథ్

### విశాఖ స్టేడియాన్ని పూర్తిగా పునరుద్దరించామని వెల్లడి

### త్వరలో మహిళా క్రికెట్ అకాడమీ ఏర్పాటు చేయనున్నామన్న కేశినేని శివనాథ్



**విశాఖపట్నం:** ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ (ఏసీఏ)ను ఏడాది కాలంలో గణనీయంగా అభివృద్ధి చేశామని అసోసియేషన్ అధ్యక్షుడు, విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) పేర్కొన్నారు. విజయవాడలో ఏసీఏ అడ్మినిస్ట్రేషన్ ఆఫీస్‌ను ఆయన నిన్న ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఏసీఏ సెక్రటరీ సానా సతీశ్ పాల్గొన్నారు.

ఈ సందర్భంగా కేశినేని శివనాథ్ మాట్లాడుతూ, విశాఖపట్నం స్టేడియాన్ని పూర్తిగా పునరుద్ధరించామని, ఏ గ్రౌండ్‌తో పాటు బీ గ్రౌండ్‌లో కూడా రెస్ట్ రూమ్స్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. విశాఖ స్టేడియంలో కుర్చీలను మారుస్తున్నామని చెప్పారు. అలాగే, భారత మాజీ కెప్టెన్ మిథాలీ రాజ్‌ను ఏసీఏ ఉమెన్ టీమ్ మెంటార్‌గా నియమించబోతున్నామని అధికారికంగా ప్రకటించారు.

ఏసీఏ చరిత్రలో ఈ ఏడాది జరిగినన్ని అంతర్జాతీయ మ్యాచ్‌లు గతంలో ఎప్పుడూ జరగలేదని ఆయన అన్నారు. ఉ మెన్స్ వరల్డ్ కప్ మ్యాచ్‌లు కూడా విజయవంతంగా నిర్వహించామని, మహిళా క్రికెటర్ల పేర్లతో రెండు గేట్‌లకు నామకరణం చేశామని వెల్లడించారు. త్వరలో మహిళా క్రికెట్ అకాడమీ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. మంగళగిరి స్టేడియాన్ని స్పోర్ట్స్ సెంటర్‌గా అభివృద్ధి చేయనున్నామని, బెంగళూరు సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ తరహాలో మూలపాడును అభివృద్ధి చేయనున్నట్లు చెప్పారు. కడప స్టేడియంలో మౌలిక వసతులు మెరుగుపరచి కొత్త రూమ్స్ నిర్మించనున్నామని వెల్లడించారు. గ్రామీణ ప్రాంతాల ప్రతిభను వెలికితీయడానికి 'రూరల్ టాలెంట్ సెర్చ్' కార్యక్రమం ద్వారా కోచింగ్ క్యాంప్‌లు నిర్వహిస్తామని, ఆంధ్ర టీమ్‌కు విదేశీ కోచ్‌ను నియమించబోతున్నామని తెలిపారు. ప్రపంచ కప్ సమయంలో మహిళా క్రికెటర్లను మంత్రి నారా లోకేశ్ ప్రోత్సహించారని, అదే టీమ్ ప్రపంచ కప్ గెలవడం ఆనందంగా ఉందని కేశినేని శివనాథ్ పేర్కొన్నారు.

ఏసీఏ సెక్రటరీ సానా సతీశ్ మాట్లాడుతూ, న్యూజిలాండ్‌కు చెందిన గ్యారీ స్టీడ్‌ను ఏసీఏ కోచ్‌గా నియమించబోతున్నామని తెలిపారు. మిథాలీ రాజ్‌ను ఉమెన్ టీమ్ మెంటార్‌గా నియమించనున్నట్లు మరోసారి స్పష్టం చేశారు. రాజకీయ ఒత్తిళ్లు ఉన్నా పారదర్శకతతోనే ముందుకు వెళ్తున్నామని అన్నారు. అండర్-14 టాలెంట్ హంట్ నిర్వహించనున్నట్లు ప్రకటించారు. క్రికెట్ అసోసియేషన్లకు అందించే ఆర్థిక సహాయాన్ని రూ.10 లక్షల నుంచి రూ.50 లక్షలకు పెంచుతున్నామని, కొత్త క్రీడాకారులను ప్రోత్సహించడమే లక్ష్యంగా పని చేస్తున్నామని సానా సతీశ్ వెల్లడించారు.

## జాకబ్ బేతల్ 142 నాటౌట్..

### ఆస్ట్రేలియాపై స్వల్ప ఆధిక్యం




**సిడ్నీ:** ఆస్ట్రేలియాతో జరుగుతున్న అయిదో టెస్టులో ఇంగ్లండ్ బ్యాటర్ జాకబ్ బేతల్ సెంచరీ చేశాడు. సిడ్నీ క్రికెట్ గ్రౌండ్‌లో జరుగుతున్న మ్యాచ్‌లో నాలుగో రోజు ఆట ముగిసే సమయానికి బేతల్ 142 రన్స్‌తో నాటౌట్‌గా నిలిచాడు. ఇంగ్లండ్ తన రెండో ఇన్నింగ్స్‌లో ఇప్పటి వరకు 8 వికెట్ల నష్టానికి 302 రన్స్ చేసింది. దీంతో ఆ జట్టుకు 119 పరుగుల ఆధిక్యం లభించింది. అయితే చివరి రోజు మిగిలి ఉన్న నేపథ్యంలో.. ఇంగ్లండ్‌కు ఓటమి అనివార్యంగా తోస్తున్నది.

జాకబత్ బేతల్ వయసు 22 ఏళ్లు. అతనికి ఇది ఆరో టెస్టు. వన్‌డౌన్‌లో క్రీజ్‌కు వచ్చిన బేతల్.. తన సుదీర్ఘ ఇన్నింగ్స్‌తో ఆకట్టుకున్నాడు. ఒకవైపు వికెట్లు పడుతున్నా.. బేతల్ మాత్రం తన పోరాట స్ఫూర్తిని ప్రదర్శించాడు. 232 బంతుల్లో అతను 15 ఫోర్లు కొట్టాడు. ఇప్పటికే ఈ సిరీస్‌ను 3-1 తేడాతో ఆస్ట్రేలియా సొంతం చేసుకున్న విషయం తెలిసిందే.

ఒకవేళ బేతల్ భారీ ఇన్నింగ్స్ ఆడకుంటే ఇప్పటికే మ్యాచ్ పూర్తి అయ్యేది. గజ్జల్లో నొప్పి కారణంగా బెన్ స్టోక్స్ బ్యాటింగ్ ఆర్డర్‌లో మార్పు చేశాడు. కానీ కేవలం ఒక్క పరుగుకే అతను ఔటయ్యాడు. అంతకముందు ఆస్ట్రేలియా తన తొలి ఇన్నింగ్స్‌లో 567 పరుగులకు ఆలౌట్ అయ్యింది. కెప్టెన్ స్టీవ్ స్మిత్ అత్యధికంగా 138 రన్స్ చేసి నిష్క్రమించాడు.

తొలి ఇన్నింగ్స్‌లో ఆసీస్‌కు 183 పరుగుల ఆధిక్యం లభించింది. బెన్ డకెట్‌తో కలిసి 81, హ్యారీ బ్రూక్‌తో కలిసి 134 రన్స్ జోడించాడు బేతల్.

## వేదిక మార్పుపై బంగ్లాదేశ్ అభ్యర్థనను తిరస్కరించిన ఐసీసీ

**ముంబై:** టీ20 వరల్డ్‌కప్‌లో భాగంగా భారత్‌లో జరిగే మ్యాచ్‌లకు చెందిన వేదికలను శ్రీలంకకు మార్చాలని బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు చేసిన అభ్యర్థనను అంతర్జాతీయ క్రికెట్ మండలి తిరస్కరించినట్లు తెలుస్తోంది. ఈ అంశంపై ఐసీసీ, బీసీబీ మధ్య వర్చువల్ కాల్ జరిగింది. బంగ్లాదేశ్ చేసిన విన్నపాన్ని తిరస్కరించిన




విషయం గురించి బోర్డుకు చెప్పినట్లు ఐసీసీ పేర్కొన్నది. వరల్డ్‌కప్‌లో ఆడాలంటే భారత్‌కు పర్యటించాల్సిందే అని, లేదంటే కీలకమైన పాయింట్లను కోల్పోతారని బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డుకు ఐసీసీ చెప్పినట్లు తెలుస్తోంది. అయితే దీనికి సంబంధించిన అధికారిక సమాచారం లేదు.

వరల్డ్‌కప్‌లో బంగ్లాదేశ్ తన తొలి మ్యాచ్‌ను ఫిబ్రవరి 7వ తేదీన వెస్టిండీస్‌తో ఆడనున్నది. ఆ మ్యాచ్ కోల్‌కతాలో జరగాల్సి ఉన్నది. ఆ తర్వాత ఇంగ్లండ్, నేపాల్‌తో ఆడనున్నది. భద్రతా దృష్ట్యా భారత్‌లో పర్యటించమని బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు చెప్పింది. ఇటీవల బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడి ఘటనలు పెరిగిన నేపథ్యంలో రెండు దేశాల మధ్య క్రికెట్ సంబంధాలు బలహీనపడ్డాయి. హిందువుల హత్యలను నిరసిస్తూ ఐపీఎల్ నుంచి బంగ్లా పేసర్ ముస్తాఫిజుర్ రెహ్మాన్ ను తొలగించారు. దీంతో సమస్య మరింత జటిలమైంది.

## సచిన్ ఇంట మోగనున్న పెళ్లి బాజాలు..

### అర్జున్ టెండూల్కర్ పెళ్లి డేట్ ఫిక్స్





**ముంబై:** భారత క్రికెట్ దేవుడు సచిన్ టెండూల్కర్ ఇంట త్వరలో పెళ్లి బాజాలు మోగనున్నాయి. ఆయన తనయుడు అర్జున్ టెండూల్కర్ వివాహ బంధంలోకి అడుగుపెట్టబోతున్నారు. ముంబైకి చెందిన వ్యాపారవేత్త రవి ఘాయ్ మనవరాలైన సానియా చంధోక్‌తో అర్జున్ ఎంగేజ్మెంట్ జరిగిన విషయం తెలిసిందే. అయితే, తాజాగా వీరి పెళ్లి డేట్ ఫిక్స్ అయినట్లు తెలుస్తోంది. ఈ ఏడాది మార్చిలోనే అర్జున్-సానియా వివాహం అంగరంగ వైభవంగా జరిపించేందుకు ఇరు కుటుంబ సభ్యులు ముహూర్తం ఫిక్స్ చేసినట్లు టాక్. పలు మీడియా నివేదికల ప్రకారం.. మార్చి 3, 4, 5 తేదీల్లో పెళ్లి వేడుకలు జరగనున్నాయి. ఈ వేడుకను అత్యంత సన్నిహితులు, బంధుమిత్రులు, కొద్దిమంది క్రికెటర్ల సమక్షంలో జరిపించేందుకు ఇరు కుటుంబాలు నిర్ణయించినట్లు తెలుస్తోంది. అయితే, దీనిపై ఇప్పటి వరకూ ఎలాంటి అధికారిక ప్రకటనా రాలేదు.

టెండూల్కర్ కుటుంబానికి కాబోయే కోడలు సానియాది వ్యాపార నేపథ్యమున్న కుటుంబం. తను సచిన్ తనయ సారాకు మంచి స్నేహితురాలు కూడా. 2020లో లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్ నుంచి గ్రాడ్యేయేషన్ పూర్తి చేసిన సానియా సొంతంగా వ్యాపారం ప్రారంభించింది. జంతు ప్రేమికురాలైన తను ముంబైలోనే మిస్టర్ పాస్ పెట్ స్పా, స్టోర్ పేరుతో ఒక బొటిక్ తెరిచింది. సారా ద్వారా అర్జున్‌కు పరిచయం అయిన సనా అతడిపై మనసు పారేసుకుంది. ఈ పేస్ గన్ సైతం ఆమెను ఇష్టపడ్డాడు.

# ఆ రెండు చిత్రాలకు హైకోర్టులో ఊరట

### టిక్కెట్లు పెంచుకునేలా ఉత్తర్వులు

**టాకీస్:** 'ది రాజాసాబ్', 'మన శంకరవరప్రసాద్ గారు' చిత్ర నిర్మాతలకు తెలంగాణ హైకోర్టులో ఊరట లభించింది. టికెట్ ధరల పెంపు, ప్రత్యేక షోల విషయంలో గతంలో సింగిల్ బెంచ్ తీర్పును హైకోర్టు 'పుష్ప2', 'ఓజీ', 'గేమ్ ఛేంజర్', 'అఖండ 2' చిత్రాలకే పరిమితం చేసింది. దీంతో తాజా చిత్రాల నిర్మాతలకు ఊరట లభించినట్లయ్యింది. టికెట్ ధరలు పెంచడానికి వీల్లేదంటూ గతంలో సింగిల్ జడ్జి ఇచ్చిన ఉత్తర్వులను సవాల్ చేస్తూ 'రాజాసాబ్', 'మన శంకరవరప్రసాద్ గారు' చిత్ర నిర్మాతలు తెలంగాణ హైకోర్టును ఆశ్రయించిన విషయం తెలిసిందే. ఆ ఉత్తర్వులను సస్పెండ్ చేయాలని కోరుతూ వేర్వేరుగా పిటిషన్లు వేశారు. టికెట్ ధరల పెంపు, ప్రత్యేక షోల కోసం హోంశాఖ కార్యదర్శికి దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు. ఆ విజ్ఞప్తిని పరిశీలించేలా హోంశాఖ కార్యదర్శికి సూచించాలని కోరారు. దీనిపై బుధవారం విచారణ జరిపిన న్యాయస్థానం.. గతంలో ఇచ్చిన తీర్పును ఆ చిత్రాల వరకే పరిమితం చేస్తూ ఉత్తర్వులు ఇచ్చింది. దీంతో ఈ రెండు చిత్రాలకు టికెట్ ధరలు పెంచుకునే అవకాశం లభించింది. మారుతి దర్శకత్వంలో ప్రభాస్ హీరోగా తెరకెక్కిన 'ది రాజాసాబ్' జనవరి 9న ప్రేక్షకుల ముందుకు రానుండగా.. చిరంజీవి హీరోగా అనిల్ రావిపూడి దర్శకత్వంలో రూపొందిన 'మన శంకరవరప్రసాద్ గారు' జనవరి 12న విడుదల కానుంది. హైకోర్టు ఉత్తర్వులతో 'ది రాజాసాబ్' బుకింగ్స్ ఓపెన్ కానున్నాయి.






# మా ఇంటి బంగారంతో సమంత పలకరింపు

**టాకీస్:** సమంత అభిమానులు ఎన్నో రోజులుగా ఎదురుచూస్తోన్న చిత్రం 'మా ఇంటి బంగారం'. దర్శకురాలు మినహా ఇప్పటివరకూ ఎవరూ ఈ సినిమా గురించి ఎలాంటి అప్‌డేట్ ఇవ్వలేదు. తాజాగా ఈ చిత్రానికి సంబంధించిన అప్‌డేట్‌ను సామ్ షేర్ చేశారు. ఈ సంక్రాంతికి టీజర్‌ను విడుదల చేయనున్నట్లు తెలిపారు. ఈ మేరకు ఓ కొత్త పోస్టర్‌ను పంచుకున్న సమంత .. ఆసక్తికర క్యాప్షన్ పెట్టారు. 'మీరు చూస్తా ఉండండి.. మా ఇంటి బంగారం మీ అందరితో కలిసిపోతుంది అంటూ రాశారు. జనవరి 9న ఈ మూవీ టీజర్‌ను విడుదల చేయనున్నట్లు వెల్లడించారు. దీంతో అభిమానులు సంబర పడుతున్నారు. 'క్వీన్ ఈజ్ బ్యాక్' అని కామెంట్స్ చేస్తున్నారు. 'ఓ బేబీ' తర్వాత సమంత దర్శకురాలు నందిని రెడ్డి కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న చిత్రం 'మా ఇంటి బంగారం'. గతేడాది అక్టోబర్ 2న దీని షూటింగ్‌ను ప్రారంభించారు. తన సొంత నిర్మాణ సంస్థ ట్రాలాలా మూవింగ్ పిక్చర్స్ పతాకంపై సమంత నిర్మిస్తున్న రెండో చిత్రమిది. దర్శకుడు రాజ్ నిడిమోరు, హిమాంక్ దువ్వూరి సహ నిర్మాతలు. 1980ల నేపథ్యంలో సాగే క్రైమ్ థ్రిల్లర్ కథతో రూపొందుతున్నట్లు సమాచారం. ఇందులో సమంతతో పాటు బాలీవుడ్ నటుడు గుల్షన్ దేవయ్య కీలకపాత్రలో నటిస్తున్నారు. దీనితో పాటు సమంత ప్రస్తుతం 'రక్త్ బ్రహ్మాండ్: ది బ్లడీ కింగ్‌డమ్' లో నటిస్తున్నారు. దర్శకద్వయం రాజ్, డీకే దీన్ని తెరకెక్కిస్తున్నారు. ఆదిత్యరాయ్ కపూర్, అలీ ఫజల్ కీలకపాత్రల్లో నటిస్తున్నారు. పీరియాడిక్ డ్రామాగా ఇది రూపొందుతోంది.

# దృశ్యం-3 ఏప్రిల్‌లో విడుదల



**టాకీస్:** మలయాళం నుంచి క్రైం థ్రిల్లర్ జోనర్‌లో వచ్చి దక్షిణాది భాషల్లో సూపర్ క్రేజ్ సంపాదించిన ఫ్రాంచైజీ ప్రాజెక్ట్ దృశ్యం. జీతూ జోసెఫ్ దర్శకత్వం వహించిన ఈ చిత్రం సస్పెన్స్, థ్రిల్లింగ్ అంశాలతో ప్రేక్షకులను కట్టిపడేస్తుందనడంలో ఎలాంటి సందేహం లేదు. ఇప్పుడీ ఫ్రాంచైజీలో అందరినీ మెస్మరైజ్ చేసేందుకు మరోసారి దృశ్యం 3 కూడా వస్తోంది. మోహన్ లాల్ , మీనా కాంబోలో వస్తోన్న దృశ్యం3 గత సెప్టెంబర్‌లో గ్రాండ్‌గా లాంచ్ అయింది. తాజా అప్‌డేట్ ప్రకారం ఈ మూవీ షూటింగ్ పూర్తయింది. ఇక ప్రేక్షకులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న ప్రకటన రానే వచ్చింది. దృశ్యం ఎంతోమందిని ప్రభావితం చేస్తూ ఇప్పటికీ క్యూరియాసిటీతో ఎదురుచూసేలా చేస్తున్న సినిమా అని అన్నాడు డైరెక్టర్ జీతూ జోసెఫ్. ఎలాంటి భారీ అంచనాలు పెట్టుకోకుండా చూసే ఫ్రాంచైజీ ఇదని.. దృశ్యం 3ఏప్రిల్ తొలివారంలో మీ ముందుకు వస్తోందని ప్రకటించాడు. మొత్తానికి మూవీ లవర్స్ ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న దృశ్యం థర్డ్ పార్టు రిలీజ్‌కు సంబంధించి డైరెక్టర్ జీతూ జోసెఫ్ క్రేజీ వార్తను షేర్ చేసి మూవీ లవర్స్‌తోపాటు అభిమానులను ఫుల్ ఖుషీ చేస్తున్నాడు. జార్జ్‌కుట్టీ ప్రపంచంలోకి మరోసారి తీసుకొస్తూ.. అంటూ మోహన్ లాల్ చాలా రోజుల క్రితం షేర్ చేసిన ఫొటో ఒకటి ఇప్పటికే నెట్టింట చక్కర్లు కొడుతోంది. దశ్యం ఫ్రాంచైజీలో వచ్చిన రెండు పార్టులు ఇప్పటికే బ్లాక్ బస్టర్ హిట్స్‌గా నిలిచాయి. ఫస్ట్ పార్ట్ థియేటర్‌లో విడుదలవగా.. రెండో పార్టు ఓటీటీలో విడుదలైంది. రెండు పార్టులను తెరకెక్కించిన ఆశీర్వాద్ సినిమాస్ దశ్యం 3ని కూడా తెరకెక్కిస్తోంది. కాగా హిందీలో అజయ్ దేవ్‌గన్, శ్రియా కాంబోలో దృశ్యం 3 కూడా తెరకెక్కుతుండగా.. ఈ మూవీని 2026 అక్టోబర్ 2న రిలీజ్ చేస్తున్నట్టు ప్రకటించారు మేకర్స్.

# యష్ బర్త్‌డే బ్లాస్ట్‌కు రంగం సిద్ధం..

**టాకీస్:** కన్నడ రాకింగ్ స్టార్ యష్ హీరోగా నటిస్తున్న లేటెస్ట్ అవైటెడ్ పాన్ ఇండియా చిత్రం "టాక్సిక్" (Ɔనీలీతిఇ) పై అంచనాలు రోజురోజుకీ పెరిగిపోతున్నాయి. 'కేజీఎఫ్' సిరీస్‌తో యష్ క్రేజ్ దేశవ్యాప్తంగా ఆకాశాన్ని తాకిన నేపథ్యంలో, ఆయన నుంచి వచ్చే ప్రతి సినిమా అప్డేట్ అభిమానుల్లో భారీ ఉత్సాహాన్ని రేకెత్తిస్తోంది. ఇదే క్రమంలో ఇప్పుడు "టాక్సిక్" మూవీపై మేకర్స్ ఒక్కో అప్డేట్‌తో హైప్‌ను మరింత పెంచుతున్నారు. ప్రముఖ దర్శకురాలు జీతూ జోసెఫ్ తెరకెక్కిస్తున్న ఈ చిత్రం సాలిడ్ గ్యాంగ్‌స్టర్ డ్రామాగా రూపొందుతోంది. ఈ మూవీలో యష్ సరసన పలువురు స్టార్ హీరోయిన్లు నటిస్తుండటంతో, క్యాస్టింగ్ నుంచే సినిమాపై ఆసక్తి నెలకొంది. ఇప్పటికే విడుదలైన చిన్న చిన్న అప్‌డేట్స్ సినిమాకు మంచి బజ్ తీసుకొచ్చాయి.

ఇక ఇప్పుడు అందరూ ఎదురుచూస్తున్న అసలు సిసలు బ్లాస్ట్‌కు మేకర్స్ సిద్ధమయ్యారు. జనవరి 8న యష్ పుట్టినరోజు సందర్భంగా 'టాక్సిక్' నుంచి బిగ్ అప్డేట్ విడుదల చేయనున్నట్లు అధికారికంగా ప్రకటించారు. ఈ మేరకు తాజాగా విడుదల చేసిన పోస్టర్ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. పోస్టర్‌లో యష్ లుక్‌ను పూర్తిగా రివీల్ చేయకుండా ఆసక్తిని రెట్టింపు చేశారు. మేకర్స్ ఇచ్చిన సమాచారం ప్రకారం, రేపు ఉదయం 10 గంటల 10 నిమిషాలకు ఆ బిగ్ అప్డేట్‌ను రిలీజ్ చేయనున్నారు. అది టీజరా, ఫస్ట్ లుక్ మోషన్ పోస్టరా, లేక యష్ పవర్‌ఫుల్ క్యారెక్టర్ ఇంట్రడక్షనా అన్నది ఇంకా సస్పెన్స్‌గా మారింది.

గతంలో యష్ బర్త్‌డే కానుకగా 'కేజీయఫ్' సినిమాల నుంచి వచ్చిన అప్డేట్స్ ఇండస్ట్రీని షేక్ చేసిన విషయం తెలిసిందే. ఆ లెవల్ సెన్సేషన్‌ను ఈసారి "టాక్సిక్" నుంచి వచ్చే ట్రీట్ బీట్ చేస్తుందా లేదా అన్నది అభిమానుల్లో పెద్ద చర్చగా మారింది. మొత్తానికి యష్ బర్త్‌డే సందర్భంగా రాబోయే ఈ బిగ్ అప్డేట్‌తో 'టాక్సిక్' మూవీ మరోసారి నేషనల్ లెవల్‌లో హాట్ టాపిక్ అవ్వడం ఖాయంగా కనిపిస్తోంది. అభిమానులు మాత్రం కౌంట్‌డౌన్ మొదలుపెట్టి, రేపటి బ్లాస్ట్ కోసం ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు.




# వాలంటైన్స్ డే రోజు కపుల్ ఫ్రెండ్లీ మూవీ రిలీజ్

**టాకీస్:** టాలీవుడ్ యాక్టర్ సంతోష్ శోభన్ హీరో గా నటిస్తున్న చిత్రం 'కపుల్ ఫ్రెండ్లీ'. అశ్విన్ చంద్రశేఖర్ దర్శకత్వం వహిస్తున్న చిత్రం యూవీ క్రియేషన్స్ సమర్పణలో యూవీ కాన్సెప్ట్స్‌బ్యానర్‌పై తెరకెక్కుతోంది. తెలుగు, తమిళ భాషల్లో తెరకెక్కుతున్న ఈ మూవీ నుంచి ఇప్పటికే విడుదలైన టీజర్‌కు మంచి స్పందన వస్తోంది. తాజాగా మేకర్స్ రిలీజ్ అప్‌డేట్ అందిస్తూ కొత్త లుక్ విడుదల చేశారు. ఈ మూవీని వాలెంటైన్స్ డే కానుకగా ఫిబ్రవరి 14న గ్రాండ్‌గా విడుదల చేస్తున్నట్టు ప్రకటించారు మేకర్స్. సన్‌లైట్‌లో హీరోహీరోయిన్లు రొమాంటిక్ మూడ్‌లో ఉన్న లుక్ నెట్టింట వైరల్ అవుతోంది. ఈ చిత్రానికి అజయ్ కుమార్ రాజు పీ కో-ప్రొడ్యూసర్‌గా వ్యవహరిస్తున్నారు. ఇప్పటికే లాంచ్ చేసిన టీజర్ మిడిల్ క్లాస్ కష్టాల నేపథ్యంలో సినిమా ఉండబోతున్నట్టు హింట్ ఇచ్చేస్తుంది. టీజర్‌లో నెల్లూరు కుర్రాడైన శివ (సంతోష్ శోభన్) ఇంటీరియర్ డిజైనింగ్ చేస్తూ, సరైన ఉద్యోగం లేక చెన్నైలో కష్టాలు పడుతుంటాడు. ఖర్చుల కోసం బైక్ పూలింగ్(రాపిడో లాంటివి) చేస్తుంటాడు. ఈ క్రమంలోనే ప్రీతి (మానస వారణాసి) అతని బైక్‌లో ప్రయాణిస్తుంది. అలా అనుకోకుండా కలిసిన ఈ ఇద్దరూ ఆ తర్వాత ఎలా ప్రేమలో పడతారు..? ఆ తర్వాత ఏం జరిగింది..? అనే నేపథ్యంలో సినిమా ఉండబోతున్నట్టు టీజర్ చెప్పకనే చెబుతోంది.





Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.